www.trinetnews.com

ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 99 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు బుధవారం నవంబర్ 11, 2026 పేజీలు:12 వెల.10/-

సమతామూర్తి ప్రాంగణంలో విష్ణు సహస్రనామపారాయణం.. గిన్నిస్ వరల్డ్ రికార్డు

హైదరాబాద్: దైవ కార్యాలకు ప్రతి ఒక్కరూ సమయాన్ని వెచ్చించాలని చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో 70వ తిరునక్షత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మూడో రోజున నిర్వహించిన తీర్థగోష్ఠి, నరసింహ స్వామి ప్రార్థన, హారతిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జానపద కళాకారులు, సంకీర్తన మండలి బృందాల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. జీవ పరిశోధన విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాలను జీయర్ స్వామి ఆవిష్కరించారు.

శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో సీఎం ముఖాముఖి.

గతాన్ని మర్చిపోవద్దు



- ఏ హోదాలో ఉన్నా గతాన్ని మర్చిపోవద్దని సూచన.
- రాష్ట్ర భవిష్యత్తు పోలీసుల నిర్ణయాలపైనే ఆధారమని వ్యాఖ్య.
- పోలీసుల పనితీరే ప్రభుత్వ ప్రతిష్ఠకు గీటురాయి.
- శాంతిభద్రతలు, అవినీతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచన.
- నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు వరకు పోరాడి ఉద్యోగాలు సాధించారని వెల్లడి.

హైదరాబాద్: మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన పోదాకు న్యాయం చేయలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో సీఎం, డీజీపీ సీవీ ఆనంద్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దని సూచించారు. “ రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది. మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతాయి. పదిమంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన బాగోలేదనే ఆరోపణలు వస్తాయి. శాంతిభద్రతలు క్షీణించి.. అవినీతి పెరిగిందనే ఆరోపణలు రావొచ్చు. పది మంది పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది.

కొంతమంది పనిగట్టుకుని నియామకాల పట్ల అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలు రాజకీయంగా మాకేం కొత్త కాదు.. మీకు మాత్రం కొత్త. నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు వచ్చాయి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికే ఈ చర్యలు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది. మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయి” అని సీఎం అన్నారు.

ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంపై రాహుల్‌తో చర్చ

- ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చ.
- రాహుల్‌గాంధీతో భేటీ అయిన మహేశ్‌కుమార్‌గౌడ్.
- హైదరాబాద్ బీసీ ర్యాలీకి రాహుల్‌కు ఆహ్వానం.
- నవంబర్ 13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్‌కు రాహుల్ రాక.
- గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశానికి రాహుల్ సూచన.
- నవంబర్ చివరికి నామినేటెడ్ పోస్టుల భర్తీ.



హైదరాబాద్‌లో ‘సర్’కు వ్యతిరేకంగా నిర్వహించనున్న సభతో పాటు మెగా బీసీ ర్యాలీలో పాల్గొనాలని రాహుల్‌ను ఆహ్వానించామన్నారు. మంగళవారం దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని రాహుల్‌కు వివరించినట్లు చెప్పారు.

దిల్లీ: తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో చర్చించినట్లు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలు, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపైనా రాహుల్‌తో చర్చించామని మహేశ్‌గౌడ్ మిగతాది 2లో

భారత్‌పై చైనా వ్లాగర్ల తప్పుడు ప్రచారం

- ఢాకా మురికివాడలను దిల్లీగా చిత్రీకరణ.
- భారత్‌పై సోషల్ మీడియాలో విష ప్రచారం.
- 150 మంది చైనీయులు వీడియోలు తీసినట్లు సమాచారం.
- తప్పుడు కథనాలపై కేంద్రం తీవ్ర ఆగ్రహం.
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని MEA సూచన.


మిగతాది 2లో


2 లో

హైదరాబాద్ సిటీకి వాటర్ ప్రాబ్లం వస్తుందా..? వాటర్ బోర్డ్ ఎండీ ఏం చెప్పారంటే.. మరో 40 నుంచి 45 రోజుల వరకు..

వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి ఎ6కు ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూ ఇచ్చారు. మరో 40 నుంచి 45 రోజుల వరకు మంజీరా, సింగూరు జలాలు నగరానికి వస్తాయని ఆయన చెప్పారు. సింగూరు మంజీరా జలాలు ఆగిపోతే నగరానికి 100MGDల నీటి గ్యాప్ ఉంటుందని, ఆ గ్యాప్ ను ఫిల్ చేయడానికి ప్రత్యామ్నాయంగా గోదావరి నుంచి 40 MGD, కృష్ణా నుంచి 15 MGD, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి 5 ఎంజీడీల నీటిని తీసుకురాబోతున్నామని ఆయన చెప్పారు.



ఎల్‌నినో ఎఫెక్ట్.. తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు

హైదరాబాద్: తెలంగాణలో పగటిపూట భానుడు భగభగమంటుంటే.. రాత్రి వేళల్లో చలి పంజా విసురుతోంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలకుపైగా నమోదవుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటోందని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.


2 లో

అధికార కాంగ్రెస్‌కు 16 మంది ప్యానెలిస్టులు

- మీడియా చర్చలు, ప్రెస్‌మీట్ల కోసం 16 మందితో ప్యానెల్ ఏర్పాటు.
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆమోదంతో నియామకాలు.
- ఉత్తర్వులు జారీ చేసిన మీడియా సెల్ చైర్మన్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.
- ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు చోటు.
- మీడియా చీఫ్ కోఆర్డినేటర్‌గా కె.శ్రీకాంత్‌యాదవ్ నియామకం.
- కన్వీనర్‌గా అవేలీ దామోదర్, కోఆర్డినేటర్లుగా తుమ్మల పద్మ, మొగిలి సత్యారెడ్డి.
- మరో 49 మందికి పార్టీ అధికార ప్రతినిధులుగా బాధ్యతలు.
- ఇప్పటికే ఉన్న అధికార ప్రతినిధులకు సీనియర్ హోదా కల్పింపు.

ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు.. కచ్చితమైన హద్దులు కల్పించడమే లక్ష్యం:

హైదరాబాద్: తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.


2లో..

కూకట్‌పల్లి భూముల వేలాన్ని అడ్డుకుంటాం: ఈటల

- హౌసింగ్ బోర్డు భూముల విక్రయంపై ఈటల ఆగ్రహం.
- పార్కులు, ఆటస్థలాలకు భూములు కేటాయించాలని డిమాండ్.
- స్థానికుల అభిప్రాయాలు తీసుకోకుండా వేలం సరికాదని వ్యాఖ్య.
- ఈ నెల 12న వేలాన్ని అడ్డుకుంటామని హెచ్చరిక.
- కాలనీవాసులతో కలిసి ఆందోళనకు సిద్ధమని ప్రకటన.



హైదరాబాద్: ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన హౌసింగ్ బోర్డు భూములను ప్రభుత్వం విక్రయించడంపై మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల విక్రయాలను నిరసిస్తూ భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. కూకట్‌పల్లిలో జనసాంద్రత అధికంగా ఉన్నందున పార్కులు, ఆటస్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా భూములను వేలం వేయడం సరికాదన్నారు. రైతుల నుంచి సేకరించిన ట్రాక్ పార్కు స్థలాన్ని సైతం విక్రయానికి పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈనెల 12న జరగనున్న భూముల వేలాన్ని కాలనీవాసులతో కలిసి అడ్డుకుంటామని స్పష్టం


2లో..

నల్గొండలో మహిళా హోంగార్డు దారుణ హత్య

నల్గొండ: మహిళా హోంగార్డు దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటన నల్గొండ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి డీఎస్పీ శివరామిరెడ్డి వివరాలు వెల్లడించారు.


2 లో

డీజీపీకి ప్రొ.జయశంకర్ వర్సిటీ వీసీ జానయ్య లేఖ

హైదరాబాద్: తనపై వస్తోన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ ప్రొ.జయశంకర్ వర్సిటీ వీసీ జానయ్య డీజీపీ సీవీ ఆనంద్‌కు లేఖ రాశారు. బదిలీ చేశానన్న కోపంతోనే మహిళా ప్రొఫెసర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనపై ఆరోపణలు చేశారని లేఖలో పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు.

శ్రీశైలం, సాగర్ అనుమతులపై KRMB లేఖ

- అసలు ప్రాజెక్టు అనుమతుల వివరాలు ఇవ్వాలని ఏపీ, తెలంగాణకు లేఖ.
- ప్రాజెక్టుల రూపకల్పన, నీటి వినియోగ వివరాలు కోరిన KRవీడీ.
- కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలు సమర్పించాలని సూచన.
- అనుమతి లేని మార్పులపై సాంకేతిక పత్రాలు అడిగిన బోర్డు.
- గతంలో రాసిన లేఖలకు వివరాలు రాలేదని అసంతృప్తి.
- అసలు అనుమతుల ఆధారంగానే తదుపరి మార్పుల పరిశీలన.



మిగతాది 2లో

మహిళా కాంగ్రెస్ నూతన కార్యవర్గం

- ఉపాధ్యక్షులుగా 11 మంది, ప్రధాన కార్యదర్శులుగా 10 మంది
- ఐదుగురు కార్యదర్శులతో పాటు 22 జిల్లాల అధ్యక్షులను ప్రకటించిన స్వర్ణ

హైదరాబాద్: తెలంగాణ మహిళా కాంగ్రెస్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ అనుమతి మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌కు 11 మంది ఉపాధ్యక్షులు, 10 మంది ప్రధాన కార్యదర్శులు, ఐదుగురు కార్యదర్శులను నియమించారు. వీరితో పాటు 22 జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.


2లో..

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అనుమతుల వివరాలివ్వండి: ఏపీ, తెలంగాణకు కేఆర్ఎంబీ లేఖ

మొదటిపేజీ తరువాయి

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి అసలు అనుమతుల వివరాలు సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (ఖ=వీదీ) తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, నీటి వినియోగం, కాల్వల సామర్థ్యం, ఆయకట్టు వివరాలతో పాటు ఆ తర్వాత చేపట్టిన మార్పులు, అదనపు నీటి అవసరాల వివరాలు ఇవ్వాలని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ సూచనల మేరకు మొదట ఆమోదించిన ప్రాజెక్టు వివరాలనే ప్రామాణికంగా తీసుకొని తదుపరి మార్పులను పరిశీలించనున్నట్లు పేర్కొంది.

శ్రీశైలం ప్రాజెక్టులో 11, నాగార్జునసాగర్‌లో రెండు అనుమతి లేని భాగాలు ఉన్నట్లు 2021 నాటి నోటిఫికేషన్‌లో కేంద్రం ప్రస్తావించిందని గుర్తు చేసింది. ఈ మార్పులకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, కేంద్ర సంస్థల క్లియరెన్స్ వివరాలను కూడా సమర్పించాలని నవంబర్ 6న జారీ చేసిన లేఖలో రెండు రాష్ట్రాలను కోరింది. గతంలో సెప్టెంబర్ 21, అక్టోబర్ 1, అక్టోబర్ 16, అక్టోబర్ 30 తేదీల్లో రాసిన లేఖలకు సంబంధించిన వివరాలు కూడా ఇంకా అందలేదని లేఖలో కేఆర్ఎంబీ పేర్కొంది.

2016 కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ కేటాయింపులు, మొదట ఆమోదించిన ప్రాజెక్టు రూపకల్పనలే ప్రాథమిక ప్రాతిపదికగా కొనసాగుతాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అక్టోబర్ 15న స్పష్టం చేసినట్లు బోర్డు తెలిపింది. ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చేసిన మార్పులు, అదనంగా చేర్చిన పథకాలు, నీటి అవసరాల పెంపు వంటి అంశాలను పరిశీలించేందుకు అసలు అనుమతుల వివరాలు అవసరమని తెలిపింది. అందుకోసం రెండు ప్రాజెక్టులకు సంబంధించి మొదట అనుమతి పొందిన పరిధి, భాగాలు... ఎడమ, కుడి కాల్వల ద్వారా నీటి మళ్లింపు వివరాలు... నీటి వినియోగం, డిజైన్ అవసరాలు... ఆయకట్టు పరిధి, సాంకేతిక అనుమతుల పత్రాలు ఇవ్వాలని సూచించింది. రాష్ట్రాల హక్కులు, వాదనలకు భంగం కలగకుండా ఈ వివరాలు సేకరిస్తున్నట్లు కృష్ణా బోర్డు స్పష్టం చేసింది.

ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు.. కచ్చితమైన హద్దులు కల్పించడమే లక్ష్యం: మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ సర్వే పురోగతిపై మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో రీసర్వే మైలురాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. మ్యాప్‌లు చూడండి

125 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యత, పారదర్శకత, కచ్చితత్వం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి అధికారులకు సూచించారు.

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే ప్రారంభించాలి

గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించడానికి ముందుగా ఆ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి, రికార్డుల్లో ఉన్న వివరాలు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను ప్రారంభించాలి.

సర్వే అనంతరం భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలి

సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలి. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, ఏవైనా అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే తెలియజేసేందుకు వారికి తగిన అవకాశం కల్పించాలి, భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.

అభ్యంతరాల నమోదు, పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించాలి
సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సర్వే అనంతరం భూ యజమానులకు ఎలాంటి నోటీసులు జారీ చేస్తారు? అభ్యంతరాలను ఎలా నమోదు చేయాలి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అనే అంశాలపై గ్రామస్థాయిలో రైతులకు, భూ యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. సర్వే ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి.

భూ యజమానుల సంతృప్తే సర్వే విజయానికి ప్రామాణికం

సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదు. ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలి. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలి. భూ యజమానులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి.

చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో వివాదానికి కారణం కాకూడదు

రీసర్వే ప్రారంభ దశలోనే ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు, లోపాలు గుర్తించినట్లయితే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలి. ఒక్క చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో మరో భూ వివాదానికి దారితీయకూడదు. సర్వేలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ కచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

భూదార్ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ కేటాయింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి. భూముల వివరాలు, హక్కులు, సరిహద్దులకు సంబంధించి స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలి. రాష్ట్రంలో ఇకపై కొత్తగా భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి.

తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

భూముల హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణాలకు సంబంధించి అనేక సమస్యలు తరతరాలుగా కొనసాగుతున్నాయి. తమ జీవితకాలంలో కూడా ఈ సమస్యలకు పరిష్కారం లభించదనే నిరాశలో ఎంతోమంది భూ యజమానులు ఉన్నారు. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతున్న ఈ సమస్యలకు సమగ్ర భూ రీసర్వే ద్వారా శాశ్వత ముగింపు పలకాలి. భవిష్యత్తు తరాలకు భూ వివాదాలు లేని తెలంగాణను అందించడమే ఈ చారిత్రాత్మక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి, అధికారులకు తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.

ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్

హైదరాబాద్ సిటీకి వాటర్ ప్రాబ్లం వస్తుందా..? వాటర్ బోర్డ్ ఎండీ ఏం చెప్పారంటే.. మరో 40 నుంచి 45 రోజుల వరకు..

మొదటిపేజీ తరువాయి

నవంబర్ 15 వరకు గోదావరి నుంచి 40MGDల అదనపు జలాలు హైదరాబాద్ కి వస్తాయని తెలిపారు. కూకట్ పల్లి, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, పటాన్ చెరువుతో పాటు వెస్ట్ సిటీకి గోదావరి అదనపు జలాలను సప్లై చేస్తామని వాటర్ బోర్డ్ ఎండీ వివరించారు. వెస్ట్ సిటీలో 3 లక్షల నీటి కనెక్షన్లకు ప్రస్తుతం సింగూరు జలాలు అందిస్తున్నామని, నగరంలో ప్రతీ ఇంట్లో 20 శాతం నీటిని పొదుపు చేస్తే నీటి సమస్యే ఉండదని తెలిపారు.

సోషల్ మీడియాలో హైదరాబాద్ లో 80 శాతం ప్రాంతాలకు నీళ్లు బంద్ అవుతాయని దుష్ప్రచారం చేస్తున్నారని, తాము ఎవ్వరికి ఎక్కడా నీళ్లు ఆపడం లేదని



ఆయన చెప్పారు. గ్రౌండ్ వాటర్ తగ్గిపోతుందని ఇల్లీగల్ బోర్ వెల్స్, ప్రైవేట్ ట్యాంకర్ల పై హైడ్రా చర్యలు తీసుకోవడంతో ప్రైవేట్ హాస్టల్స్ లో నీటి సమస్య వచ్చిందని, అంతేకానీ నగరంలో ఎక్కడా నీటి కొరత గానీ, నీటి సమస్య కానీ ప్రస్తుతానికి లేదని వాటర్ బోర్డ్ ఎండీ స్పష్టం చేశారు.

డొమెస్టిక్ అవసరాలకు ఉపయోగించే ట్యాంకర్లను ఆపొద్దని సీఎం చెప్పారని, ప్రైవేట్ ట్యాంకర్లు కమర్షియల్ అవసరాలకు వాడితే చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. గార్డెనింగ్ ల్యాండ్ స్కేపింగ్ తో పాటు ఇతర అవసరాలకు గ్రీన్ టాంకర్లను వాడాలని వాటర్ బోర్డ్ ఎండీ సూచించారు.

డీజీపీకి ప్రొ.జయశంకర్ వర్సిటీ వీసీ జానయ్య లేఖ

మొదటిపేజీ తరువాయి



తన పరువుకు భంగం కలిగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. మహిళా ప్రొఫెసర్ కాల్ లిస్టుపై విచారణ చేయాలని వీసీ జానయ్య కోరారు.

"గత రెండు సంవత్సరాల్లో నేను అమలు చేసిన ప్రగతిశీల వ్యవస్థల్ని అస్థిరపరిచేందుకు ఇదో పెద్ద కుట్ర. నన్ను వ్యక్తిగతంగా దెబ్బతీయాలనేది ఆమె ప్రయత్నం. విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దిగజార్చే దురుద్దేశంతో మాత్రమే ఈ నిరాధార ఆరోపణలు, లైంగిక వేధింపులంటూ ప్రచారం. నిజాలు నిగ్గుతేల్చి.. వెనకున్న కుట్ర కోణం బయటపెట్టాలి. మూడు నెలల కాల్ లిస్టుపై విచారణ చేసి.. వీడియో, ఆడియో కాల్స్ కూడా బయటపెట్టాలి" అని జానయ్య తన లేఖలో కోరారు.

100 మీటర్ల ఎత్తు.. హైటెన్షన్ వైర్లలో చిక్కుకున్న పారాగ్లైడర్.. చివరకు!

హిమాచల్ ప్రదేశ్‌లో ఓ పారాగ్లైడర్ సుమారు 100 మీటర్ల ఎత్తులో హైటెన్షన్ వైర్లకు చిక్కుకుపోవడం కలవరపాటుకు గురిచేసింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. సుమారు మూడు గంటలపాటు శ్రమించి సురక్షితంగా తీసుకువచ్చాయి. అతడిని రష్యాకు చెందిన అలెక్సీగా అధికారులు గుర్తించారు.

కాంగ్‌ధా జిల్లాలోని బిర్ బిల్లింగ్ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా పారాగ్లైడింగ్‌కు ఎంతో ప్రసిద్ధి. రష్యాకు చెందిన అలెక్సీ అనే పైలట్.. మంగళవారం ఇక్కడ నుంచి గ్లైడింగ్ మొదలుపెట్టారు. ఈ క్రమంలో హైవే మీదుగా ఉన్న హైటెన్షన్ వైర్లకు చిక్కుకుపోయాడు. తన మొబైల్ ఫోన్ ద్వారా ఈ విషయాన్ని నిర్వాహకులకు తెలియజేశాడు. ఓవైపు వేలాడుతూనే ఇందుకు సంబంధించిన ఫొటోలు, లొకేషన్‌ను వారికి పంపించడం గమనార్హం.
వెంటనే రంగంలోకి దిగిన అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. భారీ క్రేన్లతో పాటు సహాయక చర్యలకు అవసరమైన పరికరాలను అక్కడకు చేర్చారు. ఎన్‌హెచ్ఏఐ, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సహా ఓ నిర్మాణ సంస్థ కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. భారత వాయుసేన సహకారాన్నీ జిల్లా అధికారులు కోరినప్పటికీ.. వారి సాయం లేకుండానే క్రేన్‌తో అతడిని సురక్షితంగా కిందకు తీసుకువచ్చారు.

అధికార పార్టీకి 16 మంది ప్యానెలిస్టులు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పక్షాన విలేకరుల సమావేశాలు నిర్వహించడంతో పాటు టీవీ చానళ్లలో జరిగే చర్చల్లో పాల్గొనేందుకు 16 మంది ప్యానెలిస్టులు నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అనుమతి మేరకు వీరిని ప్యానెలిస్టులుగా నియమిస్తూ మీడియా, పబ్లిసిటీ సెల్ చైర్మన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, రాంచంద్రునాయక్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, టీఆర్ఆర్, యెన్నెం, రాజ్‌ఠాకూర్, మేడిపల్లి సత్యం, కె.రాజేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, తేజావత్ బెల్లయ్య నాయక్, సామా రామ్మోహన్‌రెడ్డి, ఎస్.చరణ్‌కౌశిక్ యాదవ్‌లు ప్యానెలిస్టుల జాబితాలో ఉన్నారు.

మీడియా చీఫ్ కోఆర్డినేటర్‌గా కె.శ్రీకాంత్‌యాదవ్, కన్వీనర్‌గా అవేలీ దామోదర్, కోఆర్డినేటర్లుగా తుమ్మలపద్మ, మొగిలి సత్యారెడ్డిలను నియమించారు. వీరితోపాటు మరో 49 మందిని పార్టీ అధికార ప్రతినిధులుగా నియమించగా, ఇప్పటికే అధికార ప్రతినిధులుగా పనిచేస్తున్న వారికి సీనియర్ అధికార ప్రతినిధులుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు ఎంపీ చామల జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారత్‌పై విష ప్రచారం.. చైనా వ్లాగర్ల తీరుపై కేంద్రం సీరియస్

మొదటిపేజీ తరువాయి

భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది చైనీస్ వ్లాగర్లు సామాజిక మాధ్యమాల వేదికగా విష ప్రచారం చేయడం ఇటీవల తీవ్ర వివాదాస్పదమైంది. బంగ్లాదేశ్‌లోని మురికివాడలను దిల్లీకి చెందినవి అని పేర్కొంటూ వారు చేసిన లైవ్‌స్ట్రీమింగ్‌పై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అది దురదృష్టకర ఘటన అని పేర్కొంది. అసలేం జరిగిందంటే..
ఇటీవల కొంతమంది చైనీస్ వ్లాగర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో భారత్‌లోని జీవన స్థితిగతులపై వీడియోలు పోస్ట్ చేశారు. ఢాకాలోని మురికివాడల దృశ్యాలను చూపిస్తూ.. అవన్నీ దిల్లీ ప్రాంతాలని అసత్య ప్రచారం చేశారు. దాదాపు 150 మంది చైనీస్ జాతీయులు ఈ వీడియోలను రికార్డు చేసినట్లు సమాచారం.
ఆశయం ఉండడం నేరమా?: సోనియా పుస్తకంపై ప్రణబ్ ముఖర్జీ కుమార్తె
వీటిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ మంగళవారం మీడియా సమావేశంలో స్పందించారు. "ఈ విషయంపై మీడియాలో వచ్చిన నివేదికలను చూశాం. ఏ దేశాన్నయినా వక్రీకరించి చూపించే ఇలాంటి ప్రయత్నాలు దురదృష్టకరం. విదేశీ వ్యక్తుల సాయంతో కొంతమంది ఢాకాను దిల్లీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు అనిపిస్తోంది. అయితే, ఇలాంటి తప్పుడు కథనాలతో వారు విశ్వసనీయతను కోల్పోతారనే విషయం గుర్తుంచుకోవాలి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నా" అని పేర్కొన్నారు.

ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంపై రాహుల్‌తో చర్చ

మొదటిపేజీ తరువాయి

ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే భారత్ సమ్మిట్‌కి రాహుల్ గాంధీ వస్తున్నారన్నారు. ఈసందర్భంగా గిగ్‌వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయమని ఆయన సూచించారని తెలిపారు. ఇటీవల మంత్రులు, ఎంపీల మధ్య తలెత్తిన విభేదాలు, దిల్లీలో జరిగిన పరిణామాలపై ఆయనతో చర్చించలేదని స్పష్టం చేశారు. నవంబర్ చివరి నాటికి తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ అవుతాయన్నారు. సోనియా గాంధీ జీవిత విశేషాలతో వెలువడిన పుస్తకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ ఆత్మకథ పుస్తకంపై తెలంగాణలో కూడా ప్రత్యేక కార్యక్రమం చేపడతామని మహేష్ గౌడ్ వెల్లడించారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు

మొదటిపేజీ తరువాయి

"నవంబరు రెండో వారం చలికాలంలోకి ప్రవేశించాం. క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉంది. కానీ, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో 2 నుంచి 4 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి కారణం ఎల్‌నినో ప్రస్తుతం తీవ్ర దశలో ఉంది. మరో రెండు నెలలపాటు ఎల్‌నినో తీవ్ర దశలో కొనసాగే అవకాశముంది. ఉత్తర భారతదేశం నుంచి పొడిగాలుల కారణంగా .. పగటి పూట ఉష్ణోగ్రతలు కొంచెం ఎక్కువగా ఉంటున్నాయి. రాత్రిపూట క్లౌడ్ లేకపోతే.. భూమి పగటి పూట గ్రహించిన వేడినంతా తిరిగి ఆకాశంవైపు రీ రేడియేట్ చేస్తుంది. దీంతో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతుంటాయి. రాత్రి సమయాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. పగటి పూట మాత్రం ఎక్కువగా నమోదవుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని కుమురం భీమ్, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతంలో చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. రానున్న ఏడు రోజుల్లో రాష్ట్రానికి ఎలాంటి వర్ష సూచన లేదు" అని శ్రీనివాసరావు తెలిపారు.

నల్గొండలో మహిళా హోంగార్డు దారుణ హత్య

మొదటిపేజీ తరువాయి

జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న హోంగార్డు మహబూబ్ బీ(43)కి గతంలో హోంగార్డుగా పనిచేసిన సతీశ్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సతీశ్‌ను కొంత కాలం క్రితం విధుల్లోంచి తొలగించారు. మంగళవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లిన తర్వాత దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మహబూబ్ బీపై సతీశ్ దాడి చేశాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న డీఎస్పీ శివరామిరెడ్డితో పాటు సీఐ ఆదిరెడ్డి, రూరల్ ఎస్సై శివప్రసాద్, వన్‌టౌన్ ఎస్సై నాంపల్లి వెంకట్ నారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మహిళా కాంగ్రెస్ నూతన కార్యవర్గం

మొదటిపేజీ తరువాయి

ఈ ఉత్తర్వుల ప్రకారం బోయలపల్లి రేఖ, అల్లూరి కృష్ణవేణి రెడ్డి, బి.లక్ష్మమ్మ, గాజుల సుకన్య, వేములకొండ పద్మ, మంగన్నగారి సుగుణ, ఆంగోతు సుగుణ, కనపర్తి కుమారి, గంగుల అంజలి యాదవ్, కె.శైలజ, బద్మె ఇందిరలను ఉపాధ్యక్షులుగా నియమించారు.

అస్మా తబుసం, గోచికొండ శ్రీదేవి, గొంగటి బిందు, ఎడ్ల విజయలక్ష్మి, కె.నాగమణిరెడ్డి, ఊటుకూరు దివ్య, టి.సురక్ష, యోగీశ్వరి, వీరబోయిన రజిత, డి.నాగమణిలను ప్రధాన కార్యదర్శులుగా, మౌనిక, చిట్టబోయిన అరుణ, పి.గౌరి, సోమలక్ష్మి, పి.పావనిలు కార్యదర్శులుగా నియమితులయ్యారు.

వీరితో పాటు గుమ్మడి శ్రీదేవి (భూపాలపల్లి), కె.సత్యప్రసూన (కరీంనగర్), శంభుల ఉషశ్రీ (ఖైరతాబాద్), డి.సౌజన్య (ఖమ్మం), జె.పద్మజ (మహబూబాబాద్), అర్కల హేమలత (మంచిర్యాల), ఆర్.లక్ష్మి (మల్కాజిగిరి), గోపగాని మాధవి (నల్లగొండ), పి.ప్రసన్నరెడ్డి (నారాయణపేట), పి.జ్యోతి (రంగారెడ్డి), కాట సుధారాణి (సంగారెడ్డి), పి.కవిత (సికింద్రాబాద్), టి.అనూరాధ (సూర్యాపేట), కె.పార్వతమ్మ (వరంగల్),

నీలి ఆర్థిక వ్యవస్థకు దీవుల మత్స్యరంగం ఊతం

ట్యూనా, సముద్ర నాచు, అలంకార చేపల అభివృద్ధికి ప్రాధాన్యం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

దేశ నీలి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో లక్షద్వీప్, అండమాన్--నికోబార్ దీవులను కీలక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ట్యూనా చేపల ఉత్పత్తి, సముద్ర నాచు సాగు, అలంకార చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ దీవుల ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అండమాన్--నికోబార్‌కు రూ.218 కోట్లు, లక్షద్వీప్‌కు రూ.175 కోట్ల పెట్టుబడులను నిర్దేశించింది.

భారత ప్రత్యేక ఆర్థిక మండలిలో దాదాపు 40 శాతం విస్తీర్ణం ఈ రెండు దీవుల సమూహాల పరిధిలోనే ఉంది. ఇక్కడి సముద్ర జలాల్లో ఎల్లోఫిన్, స్కిప్‌జాక్, బిగ్‌ఐ ట్యూనా చేపల



వనరులను సుస్థిరంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. లక్షద్వీప్‌లో ఐదేళ్లలో ట్యూనా ఉత్పత్తిని రెట్టింపు చేసి 50 వేల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించింది. అండమాన్--నికోబార్‌లో ప్రత్యేక ట్యూనా క్లస్టర్ ద్వారా చేపల వేట నౌకల ఆధునికీకరణ, శీతల గిడ్డంగుల విస్తరణ చేపడుతోంది.

లక్షద్వీప్‌ను ప్రత్యేక సముద్ర నాచు క్లస్టర్‌గా గుర్తించి సాగు, విత్తన బ్యాంకులు, హ్యాచరీలు, శిక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఆహారం, ఔషధాలు, సౌందర్య సాధనాలు తదితర పరిశ్రమల్లో సముద్ర నాచుకు ఉన్న అవకాశాలను వినియోగించనుంది. లక్షద్వీప్‌లో 300కు పైగా పగడపు దిబ్బల ఆధారిత అలంకార చేపల జాతులు ఉండటంతో నియంత్రిత సేకరణ, పెంపక కేంద్రాలు, మార్కెట్ అనుసంధానాన్ని ప్రోత్సహించనుంది.

చేపల దిగుబడి కేంద్రాలు, ఐస్ ప్లాంట్లు, శీతల సరఫరా వ్యవస్థలు, ప్రాసెసింగ్, ఎగుమతి సదుపాయాలను మెరుగుపరచడం కూడా ఈ ప్రణాళికలో భాగం. వేట అనంతర నష్టాలను తగ్గించి స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి చేయనుంది. సున్నితమైన సముద్ర పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మత్స్యకారులు, స్థానిక వ్యాపారులు, దీవుల ప్రజలకు ప్రయోజనం చేకూర్చడంపై దృష్టి సారిస్తోంది.

అండాల సేకరణ అక్రమ దందాపై సర్కారు ఉక్కుపాదం!

రాష్ట్రవ్యాప్తంగా 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను 27 కేంద్రాల్లో తనిఖీలు
ఏడు ఆసుపత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు.. షోకాజ్ నోటీసులు జారీ
31 మంది మహిళల గుర్తింపు.. వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబర్ 10: అండాల సేకరణ ముసుగులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఐవీఎఫ్ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు చేపట్టింది.రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో వైద్య అధికారులు తనిఖీలు పూర్తి చేశారు. ఈ తనిఖీల్లో ఏడు ఆసుపత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మిగిలిన కేంద్రాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులు, జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి



పలువురు మహిళలను గుర్తించగా, వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు నవంబర్ 6న వైద్య అధికారులు న్యూఢిల్లీలోని నేషనల్ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. తెలంగాణలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలను కోరారు. రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని అందజేస్తామని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) అధికారులు హామీ ఇచ్చారు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం--2021, దాని నిబంధనలకు విరుద్ధంగా మహిళల నుంచి అండాలను సేకరించడం శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొందడంతోపాటు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు



లోనై అక్రమ వైద్య విధానాలకు మహిళలు బలికావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

హైదరాబాద్‌లో క్లౌడ్ కిచెన్లపై 25 బృందాలతో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

భారీగా ఫుడ్ కలర్స్ స్వాధీనం.. గడువు ముగిసిన సగ్గుబియ్యం, బొద్దింకలు, కీటకాలు గుర్తింపు
నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని కేంద్రాల మూసివేత.. మరికొన్నింటికి నోటీసులు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10 :

నగరంలో క్లౌడ్ కిచెన్లలో ఆహార భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించేందుకు టీజీ సేఫ్ ఫుడ్ వింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భారీ స్థాయిలో తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని క్యూర్ ఏరియాలో 25 ప్రత్యేక బృందాలతో నిర్వహించిన ఈ తనిఖీల్లో పలు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆహార పదార్థాల తయారీలో నిబంధనల ఉల్లంఘనలతో పాటు పరిశుభ్రత లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

తనిఖీల సందర్భంగా ఓ కిచెన్‌లో సుమారు 15 బాక్సుల ఫుడ్ కలర్స్‌ను గుర్తించారు. మరోచోట గడువు ముగిసిన సగ్గుబియ్యం నిల్వలు బయటపడ్డాయి. కొన్ని వంటశాలల్లో బొద్దింకలు, ఇతర కీటకాలు సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కూరగాయలు కోయడానికి పరిశుభ్రతకు అనువుకాని ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులను ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది.

అంతేకాకుండా బొంబాయి రవ్వలో కూడా కొన్ని రకాల కీటకాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాల



నిల్వ, తయారీ, వంటశాలల పరిశుభ్రత విషయంలో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదనే విషయాన్ని ఈ తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి.

ఉల్లంఘనలపై చర్యలు

తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనల తీవ్రతను బట్టి అధికారులు చర్యలకు ఉపక్రమించారు. నిబంధనలు పాటించని కొన్ని క్లౌడ్ కిచెన్లను మూసివేయగా, మరికొన్ని కేంద్రాలకు షోకాజ్



నోటీసులు జారీ చేయనున్నారు. నిబంధనల్లో లోపాలను సరిదిద్దుకోవాలని సూచిస్తూ మరికొన్ని కేంద్రాలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు ఇవ్వనున్నారు. నగరంలోని క్లౌడ్ కిచెన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, వినియోగదారుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిచ్చే ఉద్దేశంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు టీజీ సేఫ్ ఫుడ్ వింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం తనిఖీలు కొనసాగుతున్నాయని, అన్ని ప్రాంతాల్లో తనిఖీలు పూర్తయిన అనంతరం గుర్తించిన ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలు, సంబంధిత కేంద్రాల పూర్తి వివరాలను మరో ప్రెస్‌నోట్ ద్వారా వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.


ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు కార్యాచరణ
బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

తెలంగాణ రాష్ట్రాన్ని ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ రంగాల్లో దేశంలోనే ప్రముఖ పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026లో ఈ రంగాలకు భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ క్రమంలో ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగానికి ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం తెలంగాణ సచివాలయంలో జరగనుంది.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సచివాలయంలోని మంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశం హైబ్రిడ్ విధానంలో (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) నిర్వహించనున్నారు. ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులు, పరిశ్రమల నిపుణులు కలిపి సుమారు 25 మంది ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పారిశ్రామికవేత్తలతో నేరుగా చర్చించి తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ఆయా సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలు, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, పరిశ్రమల విస్తరణ ప్రణాళికలపై అభిప్రాయాలు సేకరించనున్నారు. రాష్ట్రంలో ఆటోమొబైల్,



ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, బ్యాటరీ టెక్నాలజీ, ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, క్లీన్ మొబిలిటీ, రవాణా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపైనా చర్చించనున్నారు.

ప్రముఖ సంస్థల ప్రతినిధులతో కీలక చర్చలు

ఈ సమావేశానికి ఏవీఎల్ ఇండియా సీఈఓ నవీద్ నారాయణ, బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్, సెంటర్ హెడ్ అమ్జద్ ఖాన్ పఠాన్, జెడ్ఎఫ్ టెక్ సెంటర్ ఇండియా ప్రెసిడెంట్ కృష్ణస్వామి జంబునాథన్, టాఫే గ్రూప్ కార్పొరేట్ అఫైర్స్ హెడ్ రాజీవ్ నాగ్, యూఎస్--ఇండియా బిజినెస్ కౌన్సిల్ డైరెక్టర్ ప్రదీప్ కరుటూరి, టెరి సీనియర్ ఫెలో షరీఫ్ ఖమర్, డబ్ల్యూఆర్ఐ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పవన్ ములుకుట్ల తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

అలాగే ఏథర్ ఫౌండర్, సీఈఓ తరుణ్ మెహతా, జియో బీపీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రూబిన్ పాథర్, సిగ్ని ఎనర్జీ సీఈఓ వెంకట్ రాజారామన్, ఈవీఈఆర్ఈ ఫౌండర్ కృష్ణ కె. జాస్తి, ఈవీ జిప్ మొబిలిటీ సీఈఓ శ్రీధర్ శివాలెంక, హాలా మొబిలిటీ ఇండియా ఫౌండర్ శ్రీకాంత్ రెడ్డి కల్కొండ తదితరులు పాల్గొననున్నారు. మొత్తం 23 మంది ప్రముఖుల పేర్లతో కూడిన జాబితాను సమావేశానికి సంబంధించిన వివరాల్లో వెల్లడించారు.

ఐదు ప్రధాన అంశాలపై దృష్టి

ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను గుర్తించడంతో పాటు గ్లోబల్ సమ్మిట్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ కంపెనీల భాగస్వామ్యాన్ని కోరడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశం. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన విధానపరమైన మార్పులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారంపై పారిశ్రామికవేత్తల సూచనలు స్వీకరించనున్నారు.

అదేవిధంగా గ్లోబల్ సమ్మిట్‌లో ఆటోమొబైల్, ఈవీ రంగాలపై నిర్వహించే ప్రత్యేక సెషన్‌లో చర్చించాల్సిన అంశాలను ఖరారు చేయనున్నారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడంపై దృష్టి సారించనున్నారు.

కన్వీనర్‌గా ఔజాద్ షేక్

ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖలోని లాజిస్టిక్స్, సప్లై చైన్, ఆటోమొబైల్, ఈవీ విభాగం డైరెక్టర్ ఔజాద్ షేక్‌ను కన్వీనర్‌గా నియమించారు. సమావేశ నిర్వహణ, పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ బాధ్యతలను ఆయన పర్యవేక్షిస్తున్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ సమావేశం ద్వారా పెట్టుబడుల ఆకర్షణకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచస్థాయి ఆటోమొబైల్ సంస్థలు, ఈవీ తయారీదారులు, సాంకేతిక సంస్థలను తెలంగాణకు ఆకర్షించడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పరిశ్రమల విస్తరణతో ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో కీలక ముందడుగుగా నిలవనుంది.

బోమ్‌డిలాలో బుద్ధుని పవిత్ర అవశేషాల దర్శనానికి భక్తుల వెల్లువ

తొలి రెండు రోజుల్లో 11,969 మంది దర్శనం.. నవంబర్ 13 వరకు అవకాశం



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

అరుణాచల్‌ప్రదేశ్‌లోని బోమ్‌డిలా థుబ్‌చోగ్ గత్‌సెల్ లింగ్ (టీజీఎల్) మఠంలో నిర్వహిస్తున్న శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శనకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. తొలి రెండు రోజుల్లో 11,969 మంది భక్తులు పవిత్ర అవశేషాలను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బౌద్ధులకు అత్యంత పవిత్రమైన ఈ అవశేషాల దర్శనంతో మఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం, అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం, అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య సంయుక్తంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. బోమ్‌డిలాలో నవంబర్ 13 వరకు ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించనున్నారు.నవంబర్ 11న కలక్‌టాంగ్ నియోజకవర్గం, 12న బురాగావ్--థ్రిజినో నియోజకవర్గ భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. నవంబర్ 13న ఇతర జిల్లాల భక్తులు, జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది, తమకు కేటాయించిన రోజుల్లో రాలేకపోయినవారు దర్శించుకోవచ్చు.

నవంబర్ 14న పవిత్ర అవశేషాలకు సంప్రదాయబద్ధంగా వీడ్కోలు పలికి నామ్‌సాయి జిల్లాకు తరలించనున్నారు. అక్కడి గోల్డెన్ పగోడాలో నవంబర్ 14 నుంచి 20 వరకు ప్రజల దర్శనార్థం ఉంచుతారు. అనంతరం నవంబర్ 21న న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియానికి తిరిగి తీసుకురానున్నారు. భారత బౌద్ధ వారసత్వ పరిరక్షణతోపాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక అనుబంధాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

వాతావరణ నిధులపై అభివృద్ధి చెందిన దేశాలు బాధ్యత నెరవేర్చాలి: భారత్

కాప్--31లో సమానత్వం, న్యాయబద్ధ పరివర్తన, అనుకూల చర్యలకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక బాధ్యతలను నెరవేర్చాలని భారత్ స్పష్టం చేసింది. పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 9.1 ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక వనరులు అందించాలని కోరింది. టర్కియేలోని అంటాల్యాలో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్--31 ప్రారంభ సమావేశంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ కార్యదర్శి నరేంద్ర భూషణ్ భారత వైఖరిని వివరించారు.వాతావరణ చర్చల్లో సమానత్వంతోపాటు దేశాల చారిత్రక బాధ్యతలు, సామర్థ్యాలకు అనుగుణంగా చర్యలు ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి దేశం తన అభిప్రాయాన్ని వినిపించేందుకు ఐక్యరాజ్యసమితి వాతావరణ ఒప్పందం, పారిస్ ఒప్పందం సమగ్ర వేదికలుగా నిలుస్తున్నాయని తెలిపారు. చర్చలు విశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ఏకాభిప్రాయం ఉమ్మడి బాధ్యతకు దోహదపడుతుందని, కార్యాచరణ ద్వారానే హామీలు క్షేత్రస్థాయిలో ఫలితాలుగా మారుతాయని వివరించారు.ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్‌ను దాటే ముప్పు నేపథ్యంలో ఏ దేశమూ వెనుకబడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూనే ప్రపంచ వాతావరణ చర్యల్లో భారత్ తన న్యాయమైన వాటాను అందిస్తుందని స్పష్టం చేశారు.ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు న్యాయబద్ధ ఇంధన పరివర్తన, వాతావరణ ప్రభావాలకు అనుగుణంగా సన్నద్ధం కావడం సవాళ్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ దేశాల అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి చెందిన దేశాల ప్రభుత్వ నిధులు కీలకమని తెలిపారు. సదస్సులో న్యాయమైన, సమానత్వంతో కూడిన ప్రతిష్ఠాత్మక ఫలితాల సాధనకు అన్ని దేశాలతో నిర్మాణాత్మకంగా పనిచేస్తామని భారత్ వెల్లడించింది.

తెలంగాణ జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు

-సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

సింగరేణి భవన్, ట్రైనెట్ న్యూస్, నవంబరు 10 :

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ జెన్‌కో కేంద్రాలకు బొగ్గు సరఫరాపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమావేశంలో తెలంగాణ జెన్కో కు జరుగుతున్న సరఫరాను మరింత పెంచాలని నిర్ణయించారు.

జెన్‌కో థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు సూచించారు. గత మూడు నాలుగేళ్లతో పోల్చి చూసినా సరే ఈ ఏడాది తెలంగాణ జెన్‌కోకు ఎక్కువ బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరిగితే సింగరేణి తన సామర్థ్యం మేరకు మరింత బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ప్రస్తుతం 3 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని సీఎండీ తెలిపారు. ఈ నేపథ్యంలో యాదాద్రికి బొగ్గు రవాణాను పెంచడానికి చర్యలు తీసుకోవాలని జెన్ కో కు సూచించారు. ఒడిశా లో స్థానికంగా రవాణా సమస్యల వల్ల బొగ్గు రవాణాలో కొంత జాప్యం జరుగుతోందని, ఈ నెలాకరు నుంచి 16 వేల టన్నులను

తెలంగాణ త్రినెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం నవంబర్ 11, 2026
www.trinetnews.com

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా విధులు నిర్వహించాలి: సీఎం రేవంత్ రెడ్డి

డీఎస్పీలకు ప్రజాసేవ, నిజాయితీ, అంకితభావంపై దిశానిర్దేశం
తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత మీ చేతుల్లోనే ఉంది
సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణకు ఆధునిక వ్యవస్థలు.. అవసరమైతే విదేశాలకు అధ్యయనానికి పంపిస్తాం



హైదరాబాద్, త్రినెట్ న్యూస్, నవంబర్ 10: పోలీస్ అధికారులుగా బాధ్యతలు చేపట్టబోతున్న నూతన డీఎస్పీలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజల సమస్యలను ఓపికగా వినాలని, వాటిని పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. వచ్చే ముప్పై ఏళ్ల తెలంగాణ భవిష్యత్తును ఏ దిశగా నడిపించాలనే విషయంలో నూతన డీఎస్పీల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నూతన డీఎస్పీలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ పోలీసు నియామకాల ప్రక్రియ, టీజీపీఎస్సీ ప్రక్షాళన, డీఎస్పీల ఎంపికలో పారదర్శకత, పోలీసు అధికారుల బాధ్యతలు, మారుతున్న నేరాల స్వరూపం తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

సంక్లిష్ట పరిస్థితుల్లో నియామకాలు పూర్తి చేశాం

గతంలో తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందని సీఎం అన్నారు. 2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టిన తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లపాటు నియామకాలు జరగలేదని గుర్తుచేశారు. కొన్ని నెలలు ఆలస్యమైనా అభ్యర్థులు తమ జీవితంలో విలువైన సంవత్సరాలను కోల్పోయామనే బాధకు గురవుతారని పేర్కొన్నారు.

టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లు ఇచ్చినప్పటికీ ప్రశ్నాపత్రాల లీకేజీలు, ఇతర సమస్యలతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం నిరుద్యోగ యువతకు ఎంతో నష్టం కలిగించాయని అన్నారు.

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. గతంలో రాజకీయ పునరావాసానికి టీజీపీఎస్సీ కేంద్రంగా మారిందని విమర్శించారు. ఉన్నత స్థాయి నియామకాలు చేపట్టే సంస్థలో తగిన అర్హతలు, అనుభవం లేని వారిని సభ్యులుగా నియమించడం సరికాదన్నారు.

యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీ ప్రక్షాళన

యూపీఎస్సీ విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని అదే తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని సీఎం తెలిపారు. స్వయంగా యూపీఎస్సీకి వెళ్లి అక్కడి విధానాలను పరిశీలించినట్లు చెప్పారు. టీజీపీఎస్సీ తొలి చైర్మన్‌గా రిటైర్డ్ డీజీ మహేందర్ రెడ్డిని నియమించామని, పోటీ పరీక్షల నిర్వహణలో అనుభవం, చిత్తశుద్ధి ఉన్నవారికి బోర్డులో అవకాశం కల్పించామని వివరించారు.

ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్ణయించే నియామక వ్యవస్థపై విశ్వాసం ఉండటం అత్యంత ముఖ్యమని, ఆ విశ్వాసం సన్నగిల్లితే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై అపనమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

112 మంది డీఎస్పీల నియామకం చారిత్రాత్మకం

సంక్లిష్ట పరిస్థితుల్లోనూ నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసిందని సీఎం వెల్లడించారు. 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది ఉద్యోగాల్లో చేరారని తెలిపారు. 112 మంది డీఎస్పీల నియామకం కూడా ఎంతో కీలకమైన విజయమని పేర్కొన్నారు.

నియామకాల్లో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించిందని, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా ఈ ఎంపికల్లో ఉన్నారని చెప్పారు. నియామకాలపై కొందరు కావాలనే అవినీతి ఆరోపణలు చేశారని, కోట్ల రూపాయలు చేతులు మారాయని ప్రచారం చేశారని విమర్శించారు.

ఈ ఆరోపణలు అభ్యర్థుల్లో ఆందోళన కలిగించాయని, తమకు వచ్చిన ఉద్యోగ అవకాశం ఎక్కడ చేజారిపోతుందోనని వారు భయపడ్డారని అన్నారు. డీఎస్పీల నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి, నిష్ణాతులైన న్యాయవాదులతో వాదనలు వినిపించి నియామకాలను సాధించిందని వివరించారు.

మీ నేపథ్యాన్ని ఎప్పటికీ మరిచిపోవద్దు

నూతన డీఎస్పీలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ.. మీ నాలెడ్జ్, చిత్తశుద్ధి, అంకితభావమే ఈ స్థాయికి తీసుకొచ్చాయని అన్నారు. మీ సామాజిక, కుటుంబ నేపథ్యాన్ని ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు. మన నేపథ్యాన్ని మరిచిపోతే మనకు లభించిన హోదాకు న్యాయం చేయలేమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో చేరినప్పుడు ఏ లక్ష్యంతో వచ్చారో ఎప్పుడూ గుర్తుంచుకోవాలని చెప్పారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితే అసాధ్యమంటూ ఏదీ ఉండదని, ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత స్థాయికి చేరుకున్నవారు చరిత్రలో ఉన్నారని గుర్తుచేశారు.

ఇప్పటి నుంచి మీ జీవితాల్లో రెండో అధ్యాయం ప్రారంభం కానుందని, ఇది ఎంతో కీలకమైన దశ అని అన్నారు. ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండే ఉన్నత బాధ్యతాయుతమైన హోదాలో మీరు ఉన్నారని, మీ నిర్ణయాలు, ఫీడ్‌బ్యాక్ ప్రభుత్వ పనితీరుపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.

ప్రజలకు మొదట గుర్తుకొచ్చేది పోలీసులే

ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసు వ్యవస్థేనని సీఎం అన్నారు. తల్లిదండ్రుల కంటే ముందుగా పోలీసుల సహాయం కోరే పరిస్థితులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. అనేక మంది పోలీసు అధికారులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతిభద్రతలను కాపాడటం వల్లే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసం ఏర్పడిందన్నారు. సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా, నిబద్ధతతో పనిచేసి వ్యవస్థకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని, ఆ ప్రతిష్ఠను నూతన అధికారులు కాపాడాలని సూచించారు. తమ హోదాను ప్రజా ప్రయోజనాల కోసం ఎంత జాగ్రత్తగా వినియోగిస్తే అంత మంచిదని, వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేస్తే దీర్ఘకాలంలో నష్టం జరుగుతుందని హెచ్చరించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారిని కూర్చోబెట్టి ప్రేమపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యను ఓపికగా వినాలని సూచించారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే సరైన పరిష్కారం చూపగలమని చెప్పారు. సమస్యల పరిష్కారంలో సమయం, వనరులు, సాంకేతిక పరిజ్ఞానం కీలకమని వివరించారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ప్రస్తుతం నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని సీఎం పేర్కొన్నారు. గతంలో హత్యలు, అత్యాచారాలు, ఆహార కొరత వంటి సమస్యలు ప్రధానంగా ఉండేవని, ప్రపంచీకరణ తర్వాత కొత్త తరహా నేరాలు పెరిగాయని చెప్పారు. ముఖ్యంగా సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయని, నేరగాళ్లు బాధితులను ప్రత్యక్షంగా కలవకుండానే వారి ఆస్తులను దోచుకుంటున్నారని వివరించారు. డ్రగ్స్ నియంత్రణ కూడా పోలీసు వ్యవస్థకు పెద్ద సవాలుగా మారిందన్నారు. పంజాబ్ వంటి రాష్ట్రాలు కూడా డ్రగ్స్ సమస్యను ఎదుర్కొంటున్నాయని ప్రస్తావించారు. తెలంగాణలో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియంత్రణ, డ్రగ్స్ కంట్రోల్, సైబర్ క్రైమ్ వంటి రంగాల్లో ప్రత్యేక వ్యవస్థలను తీసుకొచ్చామని వెల్లడించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు.

అవసరమైతే డీఎస్పీలకు విదేశాల్లో శిక్షణ

పోలీసు అధికారుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని సీఎం తెలిపారు. అవసరమైతే నూతన డీఎస్పీలను విదేశాలకు పంపించి అక్కడి పోలీసు వ్యవస్థలు, నేర నియంత్రణ విధానాలపై అధ్యయనం చేయిస్తామని చెప్పారు. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తున్నామని గుర్తుచేశారు. అలాగే డీఎస్పీలు తమ శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వృత్తిపరమైన సామర్థ్యం, మానసిక స్థైర్యం, శారీరక ఫిట్‌నెస్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

నూతన డీఎస్పీలు అధికారాన్ని బాధ్యతగా భావించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేరాల నియంత్రణలో ఆధునిక పద్ధతులను అనుసరించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసమే పోలీసు వ్యవస్థకు అసలైన బలమని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి పనిచేయాలని పిలుపునిచ్చారు.

దేశం గర్వించేలా ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలి: మంత్రి వాకిటి శ్రీహరి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతోనే తెలంగాణకు ఖేలో ఇండియా నిర్వహణ అవకాశం-వాకిటి శ్రీహరిలి
మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి భవిష్యత్ తరాలకు అందించాలి.. డిప్యూటీ కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తున్నాం-మంత్రి వాకిటి శ్రీహరి
అనవసర ఖర్చులు వద్దు.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించాలి-మంత్రి వాకిటి శ్రీహరి
యువతను రీల్స్, బెట్టింగ్ మహమ్మారి నుంచి బయటకు తీసుకురావాలి -మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్, త్రినెట్ న్యూస్, నవంబర్ 10: దేశం గర్వించేలా, తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026ను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు పిలుపునిచ్చారు. ఖేలో ఇండియా నిర్వహణ తెలంగాణకు రావడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల, కృషి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

బేగంపేటలోని టూరిస్ట్ ప్లాజాలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణపై వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, క్రీడా శాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేయడం రాష్ట్రానికి దక్కిన గౌరవమని మంత్రి పేర్కొన్నారు. గతంలో శ్రీనగర్‌లో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ బాధ్యతలను తెలంగాణకు ఇవ్వాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో ప్రయత్నించి ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణకు తీసుకువచ్చారని తెలిపారు.

ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమైతే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. వచ్చిన అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు సాధించేందుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిమితులు ఏమిటో ముందుగా అర్థం చేసుకోవాలని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా పట్టుదలతో లక్ష్యం వైపు ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. యుద్ధంలో విజయం సాధించాలంటే పక్కా ప్రణాళిక, సమన్వయం, కార్యాచరణ ఎంత ముఖ్యమో.. ఖేలో ఇండియా నిర్వహణలోనూ అదే స్ఫూర్తితో పనిచేయాలని అన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, వాటిని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు డిప్యూటీ కలెక్టర్లకు అవసరమైన అన్ని అధికారాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని, అనవసరమైన ఖర్చులతో ప్రభుత్వ నిధులను వృథా చేయవద్దని స్పష్టం చేశారు.

ఖేలో ఇండియా నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా, ప్రభుత్వానికి ఎలాంటి మచ్చ రాకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

యువతలో క్రీడా సంస్కృతి పెంపొందించాలి-మంత్రి వాకిటి శ్రీహరి

నేటి యువత రీల్స్, సోషల్ మీడియాను ఫ్యాషన్‌గా ఎంచుకుంటున్నారని, యువత క్రీడల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువతను పట్టిపీడిస్తున్న బెట్టింగ్ భూతం నుంచి బయటకు తీసుకురావాలని, క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని పిలుపునిచ్చారు. మణిపూర్ రాష్ట్రంలో గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడా సంస్కృతిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలోని ప్రతి గ్రామంలో క్రీడా వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఖేలో ఇండియా గేమ్స్ కేవలం క్రీడా పోటీలు మాత్రమే కాకుండా తెలంగాణలో క్రీడా రంగ అభివృద్ధికి, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఒక గొప్ప వేదికగా నిలవాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

క్రీడల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు.. పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి చేసిన కృషి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న గౌరవం కారణంగా ఖేలో ఇండియా నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు దక్కాయని పేర్కొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ల పనితీరును గుర్తించి, ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల నిర్వహణ బాధ్యతలను ముఖ్యమంత్రి వారికి అప్పగించారని తెలిపారు. ప్రతి అధికారి ఈ బాధ్యతను ఒక సవాల్‌గా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఖేలో ఇండియా నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయవద్దని, పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని, పనుల్లో నాణ్యత, వేగం ఉండేలా చూడాలని ఆదేశించారు.

దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్టను చాటిచెప్పేలా ఈ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని, నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ గేమ్స్‌ను ఒక బాధ్యతగా, ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా భావించి అధికారులు అంకితభావంతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శివసేన రెడ్డి హెచ్చరించారు.

రూ.203 కోట్లతో ఖేలో ఇండియా నిర్వహణకు ఏర్పాట్లు: ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వాణీ ప్రసాద్

ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన క్రీడా వేదికలను సిద్ధం చేస్తున్నామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, కోచ్‌లు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఖేలో ఇండియా నిర్వహణ కోసం మొత్తం రూ.203 కోట్లతో ఏర్పాట్లు చేపడుతున్నామని, ఇందులో రూ.120 కోట్లను క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేటాయించి పనులు చేపడుతున్నామని వివరించారు. పనుల అమలులో స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగేందుకు డిప్యూటీ కలెక్టర్లకు లిస్ట్ ఆఫ్ వర్క్స్, లిస్ట్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ విధానాన్ని అనుసరించాలని ఆదేశిస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరా, ఇతర ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కోచ్‌లు, క్రీడాకారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

అన్ని స్టేడియాలను సిద్ధం చేస్తున్నాం: సోనిబాలాదేవిలి

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ కోసం రాష్ట్రంలోని అన్ని స్టేడియాలను సిద్ధం చేస్తున్నామని స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవి తెలిపారు. ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధంగా ఉన్నాయని, మరో 5 స్టేడియాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి పనికి సంబంధించిన వివరాలు, పురోగతిని ఐఎంఎస్ (ఐఎంఎస్) పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. ప్రతి అధికారి ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని చిత్తశుద్ధితో పనిచేయాలని, సమన్వయంతో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతం చేయాలని సోనిబాలాదేవి కోరారు.

ప్రత్యేక ప్రచారం--6లో క్రీడా శాఖకు విశేష ఫలితాలు

120 ప్రజా ఫిర్యాదుల పరిష్కారం.. 50,605 చదరపు అడుగుల స్థలం వినియోగంలోకి



న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, నవంబర్ 10: పరిశుభ్రత, పెండింగ్ అంశాల పరిష్కారం, ఈ--వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ లక్ష్యంగా నిర్వహించిన ప్రత్యేక ప్రచారం--6లో కేంద్ర క్రీడా శాఖ విశేష ఫలితాలు సాధించింది. అక్టోబర్ 2 నుంచి 31 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో భారత క్రీడా ప్రాధికార సంస్థ, లక్ష్మీబాయి జాతీయ శారీరక విద్యా సంస్థ, జాతీయ క్రీడా విశ్వవిద్యాలయం, జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ, జాతీయ డోప్ పరీక్షా ప్రయోగశాల పాల్గొన్నాయి.

ప్రచారంలో భాగంగా ఎంపీల నుంచి వచ్చిన 15 పెండింగ్ వినతులు, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన నాలుగు అంశాలను పరిష్కరించారు. అలాగే 120 ప్రజా ఫిర్యాదులు, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన రెండు అంశాలను పరిష్కరించడంతోపాటు మూడు పార్లమెంటరీ హామీలను నెరవేర్చారు. రికార్డుల నిర్వహణ మెరుగుదలకు 290 భౌతిక ఫైళ్లు, 340 ఈ--ఫైళ్ల సమీక్షను పూర్తి చేశారు.

క్రీడా శాఖ పరిధిలోని ప్రధాన, క్షేత్రస్థాయి కార్యాలయాల్లో గుర్తించిన 65 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపయోగ వస్తువులను తొలగించడం ద్వారా 50,605 చదరపు అడుగుల స్థలాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. తుక్కు విక్రయంతో రూ.9,29,946 ఆదాయం సమకూరింది. కార్యక్రమంపై అవగాహన పెంచేందుకు సామాజిక మాధ్యమాల్లో 30 పోస్టులను పంచుకున్నారు.

అక్టోబర్ 2న ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌తో ప్రచారాన్ని ప్రారంభించి, పరిశుభ్రతతోపాటు రోజువారీ వ్యాయామం, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ--2026' కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అక్టోబర్ 1న అధికారులు, సిబ్బంది స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయగా, పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు.

ప్రత్యేక ప్రచారం--6లో గణాంక శాఖకు విశేష ఫలితాలు

1,522 ఈ--ఫైళ్ల మూసివేత.. వ్యర్థాల విక్రయంతో రూ.3.70 లక్షల ఆదాయం



న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, నవంబర్ 10: పరిశుభ్రత, పెండింగ్ అంశాల పరిష్కారం, కార్యాలయ నిర్వహణ మెరుగుదల లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక ప్రచారం--6ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విజయవంతంగా పూర్తి చేసింది. అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి కార్యాలయాలతోపాటు అనుబంధ, స్వయంప్రతిపత్తి సంస్థలు పాల్గొన్నాయి. ప్రచారంలో భాగంగా 48 ప్రజా ఫిర్యాదులు, తొమ్మిది అప్పీళ్లను పరిష్కరించారు. ఎంపీల నుంచి వచ్చిన వినతులు, పార్లమెంటరీ హామీలకు సంబంధించిన అంశాల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం 718 భౌతిక ఫైళ్లను సమీక్షించి, నిబంధనల ప్రకారం అవసరం లేని 433 ఫైళ్లను తొలగించారు. మరో 1,607 ఈ--ఫైళ్లను పరిశీలించి 1,522 ఫైళ్లను మూసివేశారు. కార్యాలయాల్లో నిరుపయోగ వస్తువులను తొలగించడం ద్వారా 1,982 చదరపు అడుగుల స్థలాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, తుక్కు విక్రయంతో రూ.3,69,819 ఆదాయం సమకూరింది. దేశవ్యాప్తంగా 114 పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. వ్యర్థ వస్తువులతో కళాకృతుల తయారీ ద్వారా పునర్వినియోగం, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. అక్టోబర్ 7న ప్రత్యేకంగా నిర్వహించిన ఒకరోజు పరిశుభ్రత కార్యక్రమంలో వ్యర్థాల వర్గీకరణ, ఈ--వ్యర్థాల నిర్వహణ, స్థల వినియోగంపై దృష్టి సారించారు. క్షేత్ర కార్యకలాపాల విభాగం ఆధ్వర్యంలో సుమారు 53 ప్రదేశాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంలో సేవలందిస్తున్న పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ప్రచార పురోగతిని మంత్రిత్వ శాఖ కార్యదర్శి క్రమం తప్పకుండా సమీక్షించగా, ఫలితాలను ప్రతిరోజూ ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేశారు.

మత్తురహిత భారత్ సంకల్పంతో యువ దీపోత్సవం

30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1.19 లక్షల మందికిపైగా భాగస్వామ్యం

న్యూఢిల్లీ, త్రినెట్ న్యూస్, నవంబర్ 10: మత్తురహిత సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేసేందుకు మేరా యువ భారత్ (మై భారత్) దేశవ్యాప్తంగా దీపోత్సవాలు, యువ పార్లమెంట్ చర్చలు నిర్వహించింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' వంద వారాల సంకల్ప అభియాన్‌లో ఎనిమిదో వారం కార్యక్రమాలు నవంబర్ 6, 7 తేదీల్లో జరిగాయి. మొత్తం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1.19 లక్షల మందికిపైగా యువత, పౌరులు పాల్గొని మత్తురహిత భారత్ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు.

'నషా ముక్త్ యువ దీపోత్సవ్--ఏక్ దియా సంకల్ప్ కా' పేరుతో నిర్వహించిన 435 కార్యక్రమాల్లో భాగంగా 568 కార్యకలాపాలు చేపట్టారు. వీటిలో 1,10,101 మంది పాల్గొన్నారు. దీపాలు వెలిగించడం, ముగ్గులు వేయడం, మిఠాయిల పంపిణీ, అవగాహన కార్యక్రమాలతోపాటు మై భారత్ వాలంటీర్లను సత్కరించారు. బ్రహ్మకుమారీస్, ఈపీఎస్ఐ, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థలు కూడా భాగస్వాములయ్యాయి. పలుచోట్ల వృద్ధాశ్రమాల్లో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.

మండల స్థాయిలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ల ద్వారా నిర్వహించిన 'నషా ముక్త్ యువ పర్ పరిచర్చ'లో 85 కార్యక్రమాలు, 298 కార్యకలాపాలు చేపట్టగా 9,526 మంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, నివారణలో వారి పాత్రపై చర్చించారు.

మై భారత్ పోర్టల్‌పై పరిచయం, అవగాహన నుంచి కార్యాచరణకు తీసుకెళ్లే మార్గాలు, మార్పు సాధించిన వారి అనుభవాలతో దృశ్యశ్రవణ ప్రదర్శనలు నిర్వహించారు. నినాదాల రచన, వీధి నాటికలు, ముఖాముఖి చర్చలు, ప్రతిజ్ఞల ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించారు. యువత, స్థానిక సమాజాల నిరంతర భాగస్వామ్యంతో మత్తురహిత భారత్ సాధన దిశగా ఈ

తెలంగాణ జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు

సింగరేణి-జెన్ కో సమన్వయ సమావేశంలో
సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

హైదరాబాద్ నవంబరు 10,

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ జెన్‌కో కేంద్రాలకు బొగ్గు సరఫరాపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమావేశంలో తెలంగాణ జెన్కో కు జరుగుతున్న సరఫరాను మరింత పెంచాలని నిర్ణయించారు.

జెన్‌కో థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు



సూచించారు.

గత మూడు నాలుగేళ్లతో పోల్చి చూసినా సరే ఈ ఏడాది తెలంగాణ జెన్‌కోకు ఎక్కువ బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరిగితే సింగరేణి తన సామర్థ్యం మేరకు మరింత బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ప్రస్తుతం 3 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని సీఎండీ తెలిపారు. ఈ నేపథ్యంలో యాదాద్రికి బొగ్గు రవాణాను పెంచడానికి చర్యలు తీసుకోవాలని జెన్ కో కు సూచించారు. ఒడిశా లో స్థానికంగా రవాణా సమస్యల వల్ల బొగ్గు రవాణాలో కొంత జాప్యం జరుగుతోందని, ఈ నెలాకరు నుంచి 16 వేల టన్నులను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జెన్ కో సీఎండీ డాక్టర్ హరీష్ వివరించారు. గని నుంచి సమీప రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో జరుగుతున్న బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. గత సమావేశాల తర్వాత బొగ్గు రవాణా పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జెన్ కో లతో సహా స్థానికంగా ఉండే పలు ప్రైవేట్ సంస్థలు కూడా నైనీ బొగ్గు కోసం విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని నైనీ జీఎం ప్రస్తావించారు.

నైనీ లో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో మొదటి ప్రాధాన్యంగా తెలంగాణ జెన్ కోకు సరఫరా చేయాలని, మిగిలిన బొగ్గును కూడా ఇతర సంస్థల అవసరాల కోసం రవాణా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజు నైనీ బొగ్గు రవాణా విషయంలో తెలంగాణ జెన్ కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణ జెన్‌కో డైరెక్టర్ (కోల్ అండ్ లాజిస్టిక్స్) నాగ్యతో పాటు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

-చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్

విద్యకు మాత్రమే సమాజాన్ని మార్చగలిగే శక్తి



కూకట్పల్లి నవంబర్ 10

విద్యకు మాత్రమే సమాజాన్ని మార్చగలిగే శక్తి ఉందని అలాంటి విద్యకు రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని లిటీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే బిసి ఓవర్సీస్ విద్యా నిధి స్కీమ్ కింద రౌలకోల వంశీ విదేశీ విద్యకు అర్హత పొందాడు మేరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి సంబంధిత పత్రాన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో రమేష్ గారు సదరు విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను చదవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు ప్రభుత్వ ఆర్థిక సాయంతో విదేశాలు వెళ్లి ఉన్నత చదువులు చదివిన వారు డబ్బు సంపాదించి తిరిగి మాతృదేశానికి రావాలని ఇక్కడ సేవలు అందించాలని దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలనివిద్యార్థికి సూచించారు ఈ సందర్భంగా విద్యార్థిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, నాగార్జున ,శ్రీనివాస్ బాబు ,మస్తాన్ రెడ్డి, క్రాంతి, లక్ష్మయ్య, బాలరాజు ,రమణ ,ఆసిఫ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే టీజీఎస్ ఆర్టీసీ ధ్యేయం :

రాష్ట్రవ్యాప్తంగా 86 ప్రధాన బస్ స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో మోడల్ బస్ స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం.
రోజుకు 5,000 కంటే ఎక్కువ రద్దీ ఉన్న బస్ స్టేషన్ల గుర్తింపు
సమాచార వ్యవస్థ పటిష్టం -- అన్ని బస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్ నవంబర్ 10

రాష్ట్రవ్యాప్తంగా బస్సుల్లో ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ' (ం+ూ=ాజ) కీలక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది.

బస్ స్టేషన్లలో రద్దీ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు సంస్థ సరికొత్త కార్యాచరణ సిద్ధం చేసింది..ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగుపరచడం, బస్ స్టేషన్ల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రయాణీకుల రాకపోకలు సజావుగా సాగేలా చూడటంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన బస్ స్టేషన్లలో వసతులను మరింత విస్తరించడం కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

ఇందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ప్రతిరోజూ 5,000 మందికి పైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 ప్రధాన బస్ స్టేషన్లను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ప్రత్యేకంగా



గుర్తించి, ఆ ప్రదేశాలలో మెరుగైన ప్రయాణీకుల సమాచార మరియు ప్రసార సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ 86 బస్ స్టేషన్లన్నింటిలోనూ ప్రయాణికుల అవసరం కోసం ఒక కంట్రోలర్ ను నియించడంతో పాటూ ప్రత్యేక విచారణ, సంప్రదింపు నంబర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రయాణికులు తమకు కావలసిన బస్సు సర్వీసులు మరియు సమయాలకు సంబంధించిన వివరాలను ఎలాంటి ఆటంకం లేకుండా తెలుసుకోగలుగుతారు. అంతేకాకుండా బస్సు కార్యకలాపాలపై స్పష్టమైన మరియు తాజా సమాచారాన్ని అందించేందుకు వీలుగా కొత్త బస్సు టైమ్‌టేబుల్ బోర్డులను కూడా అన్ని బస్ స్టేషన్లలో త్వరలోనే ప్రదర్శించనున్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులకు సంబంధించి ముఖ్యంగా మొదటి మరియు చివరి బస్సు సమయాల గురించి క్రమం తప్పకుండా సమాచారం అందించేందుకు బస్ స్టేషన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ (ూూూ) ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల భద్రత, బస్ స్టాండ్లలో రద్దీ నిర్వహణ మరియు కార్యకలాపాల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసేందుకు త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఈ ప్రతిపాదిత సీసీటీవీ వ్యవస్థలను సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయానికి నేరుగా అనుసంధానిస్తారు. దీనివల్ల ప్రయాణీకుల రాకపోకలు, బస్ స్టాండ్లలో రద్దీ పరిస్థితులు మరియు బస్ స్టేషన్ కార్యకలాపాలను కేంద్రీకృత పర్యవేక్షణ ద్వారా నిరంతరం సమర్థవంతంగా పరిశీలించడానికి వీలవుతుంది.

టీజీఎస్ఆర్టీసీ బస్ స్టేషన్లలో ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడం, రద్దీ నిర్వహణను నిర్ధారించడం మరియు సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన, మెరుగైన వ్యవస్థీకృత ప్రయాణాన్ని అందించడమే యాజమాన్యం ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణీకుల సౌకర్యాలను నిరంతరం మెరుగుపరచడానికి మరియు ప్రజా రవాణా సేవలను మరింత బలోపేతం చేయడానికి టీజీఎస్ఆర్టీసీ ఎల్లవేళలా కట్టుబడి ఉందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి వెల్లడించారు...

ం+=జుణజూ కార్యకలాపాలపై ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ గారి సమీక్ష

పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
సంస్థ పనితీరు, అమలవుతున్న పథకాల పురోగతిని వివరించిన వైస్ చైర్మన్ అండ్ ఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్

హైదరాబాద్ నవంబర్ 10

రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఐఏఎస్ గారి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ం+=జుణ-జూ) కార్యకలాపాలపై పరిచయ, సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ం+=జుణజూ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ం+ూాణజూ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ సంస్థ విధులు, పరిపాలనా కార్యకలాపాలు, అమలు చేస్తున్న



వివిధ పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధానంగా మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం-కుసుమ్ పథకం, ఇంధన పొదుపు కార్యక్రమాలు, పునరుత్పాదక ఇంధన విద్యుత్ కొనుగోళ్లలో సాధించిన పురోగతి, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు.

రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ం+=జుణజూ చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరు, కొనసాగుతున్న ప్రాజెక్టుల స్థితిగతులు, సంస్థ భవిష్యత్ ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో ం+=జుణజూ జనరల్ మేనేజర్ జి.ఎస్.వి. ప్రసాద్, మేనేజర్ (ఫైనాన్స్) శ్రీనివాస్ రెడ్డి, ఖూవీ+ కన్సల్టెంట్ వెంకట్, ం+=జుణజూ కన్సల్టెంట్ కిరణ్ కుమార్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం

- దాతలు ముందుకు రావడం సంతోషం: డిజిపి సి. వి. ఆనంద్
- పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి చేయూత: ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్ డి. శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ నవంబర్ 10:

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం మైండ్ స్పేస్ లోని పెరెల్ క్లబ్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు.

ఈ నిధులను పాఠశాలలో తరగతి గదులు, సైన్స్, టెక్నాలజీ ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. పోలీసు సిబ్బంది పిల్లలతోపాటు సాధారణ ప్రజల కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం సమాన ప్రాతిపదికన నాణ్యమైన విద్యను అందించడమే ఈ పాఠశాల లక్ష్యం.

విరాళం అందించిన డాక్టర్ శ్రీనివాసరెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా అభినందించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, దాతలు ముందుకొచ్చి సహకారం అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఇతర రంగాల్లోనూ మెరుగైన అవకాశాలు కల్పించేలా పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..



పోలీసులంటే తనకు ఎంతో గౌరవమని, సమాజ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఐటీ రంగానికి చెందిన సంస్థలు, ఆర్టీసీ, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నో బిన్ -- నో ట్రేడ్ కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్‌లో విస్తృత తనిఖీలు



సైబరాబాద్ నవంబర్ 10:

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, శేరిలింగంపల్లి జోన్, నార్సింగి సర్కిల్ 45 పరిధిలోని 126వ వార్డు గండిపేటలో నో బిన్ -- నో ట్రేడ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా 126వ వార్డు పరిధిలోని జన్వాడ, మిజ్జగూడ మరియు గౌలిదొడ్డి గ్రామాల్లో వ్యాపార సముదాయాలను తనిఖీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, తడి చెత్త మరియు పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని అధికారులు సూచించారు. దుకాణాల పరిసరాల్లో చెత్తను రోడ్లపై వేయకుండా పరిశుభ్రతను పాటించాలని అవగాహన కల్పించారు.

నో బిన్ -- నో ట్రేడ్ నిబంధనలను పాటించని వ్యాపారస్తులపై తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వారికి మొత్తం ?3,200 జరిమానా విధించడం జరిగింది.

మున్సిపల్ నిబంధనలను ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా పాటించాలని, దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

నార్సింగి సర్కిల్ పరిధిలో పరిశుభ్రతను మెరుగుపరచడం, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడం మరియు ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడం లక్ష్యంగా నో బిన్ -- నో ట్రేడ్ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించడం జరుగుతుంది. సైబరాబాద్

నవంబర్ 9 నుంచి 4 వారాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించిన జీహెచ్ఎంసీ



హైదరాబాద్ నవంబర్ 10

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) 09.11.2026 నుండి 05.12.2026 వరకు అన్ని 30 సర్కిళ్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమం 'ప్రగతి 50 నగరాల' ఫ్రేమ్‌వర్క్ యొక్క కీలక పనితీరు సూచికల (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్) ఆధారంగా రూపొందించబడింది. ప్రతి వారానికి ఒక థీమ్ ఉంటుంది, మరియు ప్రతి పనిదినానికి ఒక నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక చేయబడింది.

రెండవ రోజు కార్యాచరణ: నీటిపై తేలుతున్న వ్యర్థాలు, పూడిక, చెత్తాచెదారం తొలగింపు; ప్రవేశ మార్గాల వద్ద డంపింగ్‌ను నిరోధించడం; జీహెచ్ఎంసీ యొక్క అన్ని 30 సర్కిళ్లలో సైన్ బోర్డుల ఏర్పాటు. శుభ్రం చేయబడిన చెరువులు/వలలు/మురుగు కాలువలు/నాలాల సంఖ్య (సంఖ్య): 57; నీటిపై తేలుతున్న వ్యర్థాలు, పూడిక ం చెత్తాచెదారం తొలగింపు 43.6 మెట్రిక్ టన్నులు, డంపింగ్ ప్రవేశ మార్గాల వద్ద నియంత్రణలోకి తీసుకున్నవి 21, ఏర్పాటు చేసిన సైన్ బోర్డుల సంఖ్య (1).

చంద్రపురి కాలనీ బీజేవైఎం అధ్యక్షుడిగా ఆర్. రాకేష్ నియామకం

రాగం అర్జున్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత



భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా ఆర్. రాకేష్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం మేడ్చల్--మల్కాజిగిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.
బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆమోదంతో ఈ నియామకం చేపట్టారు.
ఈ సందర్భంగా రాగం అర్జున్ మాట్లాడుతూ.. రాకేష్ నాయకత్వంలో చంద్రపురి కాలనీలో యువ మోర్చా మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.
నూతన అధ్యక్షుడు ఆర్. రాకేష్ మాట్లాడుతూ.. తనకు ఈ బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యువ మోర్చా బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు జోగారావు, బీజేపీ సీనియర్ నాయకులు ఉడుత సంతోష్ గుప్తా, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆర్. రాకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


బ్రహ్మంగారి దేవాలయంలో స్వాములకు ఆయుర్వేద వైద్య శిబిరం డాక్టర్ ఆర్ శ్రీనివాస్



ఇంటింటికి ఆయుర్వేదం మన జీవన విధానం కావాలి డాక్టర్ ఆర్ శ్రీనివాస్ లింగాలపాలెం మండలం కోట నెమలిపురి బ్రహ్మం దేవాలయంలో అయ్యప్ప స్వాములకు శివ స్వాములకు పై అధికారులు శ్రీ రోణంకి గోపాలకృష్ణ ఆయుష్ శాఖ డైరెక్టర్ మరియు ఎం శేఖర్ రాజు ప్రాంతీయ ఉపసంచాలకులు ఆదేశానుసారం డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కోట నెమలిపురి ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆయుర్వేదం పైన సీజనల్ వ్యాధుల పైన అవగాహన సదస్సు మరియు వైద్య శిబిరం డాక్టర్ ఆర్ శ్రీనివాస్, వైద్యాధికారి మాట్లాడుతూ ఆయుర్వేదం మన జీవనవేదం అని ఆయుర్వేదమనగా ఆయుష్షును(శరీరాన్ని) మరియు ఆరోగ్యాన్ని కాపాడే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రం. ఆయువు అనగా జీవితం. వేదం అనగా శాస్త్రం ఇది మనసు శరీరము మరియు ఆత్మ మధ్య సమతుల్యతను కాపాడుతూ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే జీవన విధానం అని తెలియపరిచి దినచర్య రూతు చర్య యొక్క ప్రాముఖ్యత తెలియపరచి యోగ ప్రతి ఒక్కరు చేయాలని తెలియపరిచారు సాత్వికహారము తీసుకొనవలెను మజ్జిగ ద్రపదార్థాలు ఎక్కువ తీసుకోవాలని తెలియపరిచారు అక్కడికి వచ్చిన భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుష్ మందులను పంపిణీ చేయడం జరిగింది ముఖ్య అతిథులుగా గోవిందా చారి పూజారి కరుణాకర్ రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని ఆయుష్ మందులను స్వాములకు పంపిణీ చేయడం జరిగింది యోగ టీచర్లు జి నరసింహారావు వెంకటరమణ చేత యోగా వాటి ప్రాముఖ్యత గురించి తెలియపరచడం జరిగింది

జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్ ,మరిపెడ మండలం బురాన్ పురం,

గ్రామంలో కొనసాగుతున్న ఈ సర్వేను పరిశీలించారు,
మున్సిపల్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలలో కొనసాగుతున్న చేయూత పెన్షన్లు ప్రక్రియను పరిశీలించి



అధికారులకు తగు సూచనలు జారీ చేశారు,

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చేయూత పెన్షన్లు పథకం పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులకు కచ్చితంగా పెన్షన్లు అందించే విధంగా చర్యలు తీసుకొని ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు,
పెన్షన్ల పర్యవేక్షణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు,
ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి, శ్రీమన్నారాయణ రెడ్డి, రేవంత్, సంబంధిత అధికారులు ఉన్నారు.

రెండు గ్రామాల, గౌడ్ సంఘాల ఈతవనం పంచాయతీ,

చిన్న శివునూర్ గ్రామ పరిధిలో కర్నాల్ పల్లి, గౌడన్నల ఈత కల్లు విక్రయిస్తున్నారు,
ఎల్లమ్మ ఆలయం చిన్న శివ నూర్ రెవెన్యూ పరిధి..





చేగుంట మండలంలోని చిన్న శివనూర్, కర్నాల్ పల్లి గ్రామాల గౌడ కులస్తులు పంచాయతీ నడుస్తుంది. మండల పరిధిలోని కర్నాల్ పల్లి ఎల్లమ్మ దేవాలయం లో చిన్నచిన్నూరు గ్రామ గౌడ కులస్తులు ఆలయ అర్చకులుగా, వాహనాలకు పూజలు, ఇతర దుకాణాల వద్ద గౌడ కులస్తులు మంగళవారం వ్యాపారాలు చేశారు. కర్నాల్ పల్లి ఎల్లమ్మ దేవాలయం చిన్న శివునూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉండడం విశేషం, ఇది ఇలా ఉంటే ఆనాడు పెద్దమనుషుల సమక్షంలో ఎవరు పరిధిలో ఎవరు వ్యాపారాలు చేసుకోవాలని సదుద్దేశంతో ఎల్లమ్మ టెంపుల్ పరిధిని కర్నాల్ పల్లి గౌడ కులస్తులకు, ఆ పరిధి దాటి రావద్దని చిన్న శివనూర్ గౌడ కులస్తులకు పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఇది ఇలా ఉంటే కర్నాల్ పల్లి గౌడ కులస్తులు చిన్న శివనూర్ పరిధి దాటి ఈతకల్లును విక్రయిస్తున్నారు. తమ గ్రామ పరిధిలో విక్రయిస్తూనే, తమకు కళ్ళు మామ్ల లేకుండా చేయాలని చూస్తున్నారు. ఇలా పలుమార్లు కరుణాలపల్లి గౌడ కులస్తులను మందలించిన వారిలో మార్పు రాలేదు, ఇది చూసి ఆగ్రహానికి గురైన చిన్న శివనూర్ గౌడ కులస్తులు ఇదంతా మా రెవెన్యూ పరిధి, మీకు ఇవ్వాల్సింది ఏం లేదంటూ సోమవారం ఆలయం వద్ద పంచాయతీ పెట్టుకుని ఆలయ అర్చకులుగా, వాహనాల పూజలు, కొబ్బరికాయల వ్యాపారం, కల్లు కొట్టు, అన్ని వారే కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూల్ పల్లి గోడ కులస్తులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఎంత సంపాదించుకున్న వీరికి పేరాశ పోవడం లేదని, పెద్ద మనుషులు ఇచ్చినటువంటి గౌరవం మర్యాదలను కాపాడుకోలేకపోతున్నారని వీరిపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఇక మా పరిధిలో ఉండే అన్ని మేమే కార్యక్రమాలు నిర్వహించుకుంటామని కర్నాల్ పల్లి గ్రామ గౌడ కులస్తులను హెచ్చరించారు.

అంబర్‌పేట్‌లో ఘనంగా బీఆర్ఎస్ నేత మల్లికార్జున్ యాదవ్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్ అంబర్‌పేట్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి... పటేల్ నగర్‌లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు అంబర్‌పేట్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్ జన్మదిన వేడుకలను పటేల్ నగర్‌లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్వయంగా పండ్లు, జ్యూస్‌లు పంపిణీ చేసి శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మల్లికార్జున్ యాదవ్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి మల్లికార్జున్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, లింగారావు, రామారావు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహాకవి అందెశ్రీ గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

ఈరోజు 19వ డివిజన్ పరిధిలోని ఉన్న బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద తెలంగాణ గేయకవి, మహాకవి అందెశ్రీ గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోలేపాక అంజయ్య గారి అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగిందిఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ అజీజ్ భాయ్ గారు, శ్రీనివాస్ గారు, జెమినీ గారు, సమ్మయ్య గారు, సుధాకర్ గారు, బెస్త రమేష్ గారు, ఎ. రాజు గారు, శేఖర్ గారు, అఖిల్ గారు, రాజు గారు, పంగ యాకయ్య గారు, లాజర్ గారు,దీ.అంజయ్య గారు తదితరులు పాల్గొన్నారు



ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పోరాటం ఫలితం.. ఓటర్లకు ఈ నెల 21 వరకు అవకాశం

ఓటు హక్కు కోల్పోయిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంత్ రెడ్డి విజ్ఞప్తి



మల్కాజిగిరి: ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా ఓటు హక్కు కోల్పోయిన ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌పై చేసిన పోరాటం ఫలించిందని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పోరాటానికి స్పందించిన ఎన్నికల కమిషన్ కొంతమంది ఓటర్లకు ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం కల్పించిందని వెల్లడించారు.ఈ మేరకు ఆనంద్‌బాగ్‌లోని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంత్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా షిఫ్టింగ్ అయిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు నమోదై ఉండటంతో ఓటు హక్కు కోల్పోయిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.
ఓటు హక్కు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేసుకుని తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు కృషి చేయాలని లక్ష్మీకాంత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వారసిగూడ ముంతాజ్ హోటల్ లైన్‌లో పారిశుద్ధ్య పనులు పూర్తి

ప్రజా సమస్యపై వెంటనే స్పందించిన జిఎస్ఆర్ టీమ్ సయ్యద్ సద్దాం



వారసిగూడ ప్రాంతంలోని ముంతాజ్ హోటల్ లైన్‌లో రోడ్లు, వీధులు తీవ్ర అపరిశుభ్రంగా మారడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై జిఎస్ఆర్ టీమ్ సభ్యులు సయ్యద్ సద్దాం భాయ్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయంపై సయ్యద్ సద్దాం భాయ్ చొరవ తీసుకొని, టి. రామేశ్వర్ గౌడ్ గారి సూచనల మేరకు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ముంతాజ్ హోటల్ లైన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టి చెత్తను తొలగించారు.దీంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య సమస్య పరిష్కారమైంది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న జిఎస్ఆర్ టీమ్ సభ్యులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందపురం బస్ స్టాప్ వద్ద విద్యార్థుల అవస్థ... రంగంలోకి చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ!

దౌల్తాబాద్ మండలం గోవిందపురం బస్ స్టాప్ దగ్గరికి వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. సరైన బస్సు సౌకర్యం లేక ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు వడుతున్నారు. ఉదయం నుంచి బస్ స్టాప్ వద్ద వేచి చూస్తున్నా బస్సులు రాకపోవడంతో స్కూల్ కు టైం కు చేరుకోలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్న చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ వెంటనే గోవిందపురం బస్ స్టాప్ కు చేరుకున్నారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
డిపో మేనేజర్ రెండు బస్సులు అదనంగా వేస్తే పిల్లలు సరైన టైం కు వెళ్లి చదువుకుంటారని కోరారు. డిపో మేనేజర్ స్పందించి త్వరలోనే సమస్య పరిష్కరించాలని కోరారు
విద్యార్థుల కోసం అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.





ప్రభుత్వ భూమిని కాపాడిన ఎం ఎల్ ఏ మాధవరం కృష్ణారావు

కే పి ఎచ్ బి లోఎట్టకేలకు ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి 2.39 ఎకరాల భూమి విద్యాశాఖకు బదిలీ.. కలెక్టర్ మనూ చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ డివిజన్ రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం గతంలో కేటాయించిన 2.39 ఎకరాల స్థలాన్ని ఎట్టకేలకు హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేయడంతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారంనాడు మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ మనూ చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సుమారు మూడు సంవత్సరాల క్రితం రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టి పాఠశాల పునాదులు కూడా వేయడం జరిగింది... అయితే అనంతరం ప్రభుత్వం మారడంతో వివిధ కారణాల వల్ల పాఠశాల నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ముఖ్యంగా హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న 2.39 ఎకరాల స్థలాన్ని విద్యాశాఖకు బదిలీ చేయడంలో జాప్యం జరగడంతో పాఠశాల నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది.

ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పేద,



మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పలుమార్లు కలెక్టర్‌తో పాటు సంబంధిత ప్రభుత్వ అధికారులను కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడే ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని నిరంతరం కృషి చేశారు. స్థానిక ప్రజలు, కాలనీ వాసులు సైతం ఈ అంశంపై తమ పోరాటాన్ని కొనసాగించారు.

ఎట్టకేలకు ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా, ప్రజల పోరాటం, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరంతర కృషి ఫలితంగా 2.39 ఎకరాల స్థలాన్ని హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేయడం జరిగింది. దీంతో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలెక్టర్ మనూ చౌదరి ని పాఠశాల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని, పాఠశాలను కూడా త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా కోరారు.

ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి భూమి బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా సహకరించిన కలెక్టర్ మనూ చౌదరి కి ఎమ్మెల్యే కృష్ణారావు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వానికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

అదేవిధంగా నియోజకవర్గంలోని పలు కాలనీలకు సంబంధించిన భూములను 22-ఏ నిబంధనల పరిధిలో ఉంచడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విద్యా రుణాలు పొందడంలో, ఇతర అవసరాలకు బ్యాంకు రుణాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆయా భూముల అంశాన్ని కూడా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు,నాగేశ్వర రావు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధి రూ 48.72 కోట్ల నిధులు మంజూరు చేయాలి

పనుల ప్రతిపాదనలు మంత్రి వాకిటి శ్రీహరికి అందజేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ‌ఉ వైస్ చైర్ పర్సన్ జూపల్లి

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.48 కోట్ల 72 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరికి అభివృద్ధి పనుల ప్రతిపాదనలను అందజేశారు.



ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబుతో కలిసి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంత్రిని కలిసి పట్టణ అభివృద్ధికి అవసరమైన పనుల వివరాలను వివరించారు.

ఈ సందర్భంగా అశ్వారావుపేట మున్సిపాలిటీలోని మొత్తం 22 వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.35.52 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. భగత్‌సింగ్ సెంటర్ నుంచి అంబేద్కర్ నగర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షపు నీటి కాలువల నిర్మాణానికి రూ.5.87 కోట్లు, పట్టణంలోని నాలుగు వార్డుల్లో ప్రధాన డ్రెయిన్ల నిర్మాణానికి రూ.4.33 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

అదేవిధంగా పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు జేసీబీ, డోజర్, ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోల కొనుగోలుకు రూ.2 కోట్లు, పట్టణంలోని వీధుల్లో మెరుగైన వెలుగులు నింపేందుకు ఎల్‌ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు రూ.25 లక్షలు ప్రతిపాదించారు. ప్రజలకు నిరంతర మంచినీటి సరఫరా అందించేందుకు మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.50 లక్షలు, సబ్‌మర్సిబుల్ మోటార్లు, పంపుసెట్ల ఏర్పాటుకు మరో రూ.25 లక్షలు కేటాయించాలని మంత్రికి సమర్పించిన ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

కార్తీక మాసోత్సవ పూజలు ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో తేదీ 10-11-2026 నుండి 08-12-2026 వరకు నిర్వహించే కార్తీకమాసోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు బ్రాహ్మీ ముహూర్తంలో మంగళ వాయిద్యాల నడుమ ఉత్తిష్ఠ గణపతి ఆరాధనతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం రుద్రేశ్వర స్వామివారికి 11 లీటర్ల ఆవుపాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించడంతో పాటు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక మాసోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి. అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, నాగరాజు, తోట వెంకటేశ్వర్లు,



బోడ డిన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పవిత్రమైన మాసమని అన్నారు. ముఖ్యంగా మహిళలు కులమతాలకు అతీతంగా సామూహికంగా దీపాలు వెలిగించడం ఈ మాసంలో ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఎంతో పురాతనమైన వేయి స్తంభాల దేవాలయంలో పరమశివుడిని దర్శించుకుని పూజలు నిర్వహించడం ఎంతో అనుభూతిని కలిగిస్తుందని తెలిపారు.

కార్తీక మాసంలో శివారాధన ఎంతో విశిష్టం

అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బెంగళూరుకు చెందిన జయేంద్రపురి మహాస్వామి తమ శిష్య బృందంతో ఆలయానికి విచ్చేసి రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.ఆయన మాట్లాడుతూ భగవంతునిపై మనసును సంపూర్ణంగా లగ్నం చేసుకునేందుకు కార్తీక మాసం ఎంతో అనువైన కాలమని అన్నారు. ధ్యానం, ధ్యేయం, ధ్యాత అనే మూడు స్థితులను వివరిస్తూ, సాధకుడు మొదట దైవంపై ధ్యానం ప్రారంభిస్తాడని, ధ్యానంలో ఏకాగ్రత పెరిగే కొద్దీ ధ్యేయం కూడా తొలగిపోయి ధ్యానించేవాడు మాత్రమే మిగులుతాడని వివరించారు. అదే అద్వైత సిద్ధికి ఆరంభమని వేదాంతం చెబుతోందని పేర్కొన్నారు.కార్తీక మాసంలో శివారాధన, ఉపవాసాలకు విశేష ప్రాధాన్యత ఉందని, ఉభయ సంధ్యల్లో దీపారాధన చేయడం శ్రేష్ఠమని తెలిపారు. ముఖ్యంగా సాయంసంధ్య వేళ ఆకాశదీపం వెలిగించాలని, ఉసిరికాయపై వత్తి ఉంచి దీపారాధన చేయడం శుభఫలితాలను ఇస్తుందని వివరించారు.

కడ్తాల్ మండల సభలో తహసీల్దార్ కు సర్పంచ్‌ల ప్రశ్నల వర్షం

అటవీ హద్దుల సమస్య నుంచి రేషన్ కార్డుల వరకు.. అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

కడ్తాల్ మండల సభలో ప్రజా సమస్యలపై సర్పంచ్‌లు గళమెత్తారు. మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారుల దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లి ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై తహసీల్దార్‌ను వివరణ కోరారు.

అనుమాస్పల్లి గ్రామ పరిధిలోని అటవీ భూముల హద్దుల అంశంపై గ్రామ సర్పంచ్ నేనావత్ శ్రీను సభలో ప్రస్తావించారు. అటవీ హద్దుల విషయంలో నెలకొన్న సమస్యలపై స్పష్టత ఇవ్వాలని, గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా రేషన్ కార్డుల సమస్యపై పలు గ్రామాల సర్పంచ్‌లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన



పేదలకు రేషన్ కార్డులు అందకపోవడం, రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

మండల సభ వేదికగా ప్రజాప్రతినిధులు సమస్యలను బలంగా ప్రస్తావించడంతో సంబంధిత శాఖల అధికారులపై బాధ్యత మరింత పెరిగింది. ప్రజల సమస్యలపై కేవలం చర్చలకే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, గడువులతో కూడిన స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి,

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, పనులను గుర్తించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి అధికారులతో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ దరఖాస్తులు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ జి.ఓ. నంబర్ 76, 58, 59 క్రింద వచ్చిన దరఖాస్తులు, భూ భారతి కార్యక్రమం, భూముల రీ-సర్వే, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జి.ఓ. నం. 76, 58, 59 లకు సంబంధించిన దరఖాస్తుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, భూ రికార్డుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు మంజూరు చేసేందుకు అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం



చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకొని, ప్రజలకు సంబంధించిన సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని తెలిపారు.

లక్షెట్టిపేట మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్ లతో కలిసి ప్రారంభించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. పచ్చి బియ్యం బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ రకం బియ్యం బస్తా 1 వేయి 898 రూపాయలు, జె.ఎస్.ఆర్. స్టీమ్ బియ్యం 1 వేయి 924 రూపాయలు, పాత బియ్యం 2 వేల 28 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, ధాన్యం మిల్లింగ్ కార్యకలాపాలకు రైస్ మిల్లులు కీలకంగా నిలుస్తాయని, రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేయడం,



ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. మిల్లింగ్ ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, సంబంధిత శాఖల మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యకలాపాలు కొనసాగించాలని సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, భోజన శాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులను నిర్ణీత ప్రమాణాలతో, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులలో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం అందించాలని, భోజనం నాణ్యత, వంటశాల పరిసరాలు, పరిశుభ్రత తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవల కోసం ఎల్ఓసి అందజేత

శాసనసభ్యులు కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్జాల్ గ్రామానికి చెందిన గుంత శిరీష ఆంజనేయులు దంపతుల కుమారుడు గుంత సాకేత్ కు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మంగళవారం హైదరాబాదులోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి. వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారుడు గుంత ఆంజనేయులు కుటుంబ సభ్యులకు 600000-00 ఆరు లక్షల ఎల్ఓసి అందజేశారు.

ఎమ్మెల్యే నారాయణరెడ్డి. మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చికిత్స పొందలేని కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని ఆలోచనతో ఎల్ఓసి అందజేస్తుందని , ఎల్ఓసి సహాయం బాధిత కుటుంబాలకుఎంతో ఊరట నిస్తుందని అన్నారు.ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తానని కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ



సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఎల్ ఓ సి అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెలే కసిరెడ్డి నారాయణరెడ్డి. కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి మాజీ ఎంపిటిసి ఏం అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ అంజయ్య గౌడ్, మాజి ఉపసర్పంచ్ లు బి.నర్సింలు, అజీజ్, నాయకులు ఏ . వెంకట్ రెడ్డి, ఎం.డి.ఆరిఫ్ వద్దే రాజు పులిజాల విష్ణు తదితరులు పాల్గొన్నారు..

శ్రీరామదూత ఆశ్రమన్ని సందర్శించిన సిఐ వెంకటేశ్వర్లు





ఆమనగల్లు పట్టణశీలో వెంకటేశ్వర దేవాలయం సమీపంలో గల శ్రీరామ దూత ఆశ్రమంలో నూతనముగా ప్రవచన మండపం నిర్మించడం జరిగినది.ఇంతకు ముందు గల భవనం ప్రవచన మండపంకు నాలుగు ఫీట్ల దిగువ వున్నందున హర్యానా కాంట్రాక్టర్ ద్వారా జాకీ ల సహాయంతో భవనం 4 ఫీట్ల లేపడం జరుగుతుంది. సిఐ వెంకటేశ్వర్లు,నిత్య శుద్ధానందస్వామి క్షేత్రం, శ్రీరామ దూత ఆశ్రమం, ఆమనగల్లు,ఆశ్రమ సంస్థ పకులు శివానందగిరి స్వామి, తల్లోజు వెంకటయ్య, బిక్కుమాళ్ళ యాదయ్య, వీరబొమ్మ రామ్మోహన్,మండెం చంద్రశేఖర్, గుర్రం సురేష్ కుమార్,తల్లోజు మాధవి చారి.తదితరులు పాల్గొన్నారు.

వల్లభాపురం పశుపతినాథ్ ఆలయంలో ఆకాశదీపం ప్రారంభం

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపురంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో కార్తీకమాస ప్రారంభోత్సవం సందర్భంగా ఆకాశదీప కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్తీకమాసం నెలరోజుల పాటు ప్రతిరోజూ సాయంకాలం నిర్వహించే ఆకాశదీప కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ అర్చకులు శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి కోరారు.కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ గంజి భవనరుషి, రాకేష్ అశోక్ విజయశ్రీ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్. కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.అనంతరం కల్వకుర్తి



నియోజకవర్గంలోని పలు సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని గోలి శ్రీనివాస్ రెడ్డికి కేటీఆర్ సూచించారు.వారితో పాటుమాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్. ఉన్నారు.

కార్యక్రమంలో కల్వకుర్తి మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింగం విజయ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,నాయకులు సుభాష్, బుచ్చిబాబు,బుజ్జి, శేఖర్,పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా మంచినీటి పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన పి ఏ సి చైర్మన్ గాంధీ



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్ కాలనీలో రూ.6 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు జలమండలి అధికారులు ఏ తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

ఈ సందర్భంగా పీ ఏసీపీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో మంగళవారం నాడు వెంకట పాపయ్య నగర్ కాలనీలో రూ.6 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు,అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.

కాలనీలలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు ,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని వాటిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని, అదేవిధంగా ప్రతి కాలనీ లో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు ప్రజలకు, స్వచ్ఛమైన మంచి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పి ఏ సి చైర్మన్ గాంధీ అన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యు జి డి పైప్ లైన్ మంచి నీటి పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని పీఏసీపీ చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పి ఏ సి చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది , నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి

ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని పీఏసీపీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.

అభివృద్ధి/ శంకుస్థాపన చేసిన పనుల వివరాలు

1.ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకట పాపయ్య నగర్ కాలనీలో రూ.6 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు

ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు ఈ డి సంతోష్ రెడ్డి ,జి ఎం హరి శంకర్, డి జి ఎం నరేందర్ మేనేజర్ నరేందర్ మరియు నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు

ప్రజాసమస్యలని వేంటనే పరిష్కరించాలని అధికారులని ఆదేశించిన ఏం ఎల్ ఏ మాదవరం కృష్ణారావు



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం నాడు బేగంపేట డివిజన్ పరిధిలోని మాతాజీ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆయనకు వివరించారు.

దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గారు, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు కలగకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బేగంపేట డివిజన్‌లో దాదాపు 80 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశామని పేర్కొన్నారు. నూతన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, వాటర్ పైప్‌లైన్లు, మౌలిక సదుపాయాలు, శ్మశాన వాటికలు, పార్కులు తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కుంటుపడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్ , సురేష్, రాజయ్య, శ్రీను, రాజు, గంగారాం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలను ఖచ్చితమైన అంచనాలతో, పూర్తి వివరాలతో సిద్ధం చేయాలి,

•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,





గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణలో భాగంగా అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఖచ్చితమైన అంచనాలతో, పూర్తి వివరాలతో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వ శాఖల వారీగా చేపట్టవలసిన అభివృద్ధి పనులు, నిర్వహణ పనులు, భూసేకరణ, విద్యుత్ ఛార్జీలు, ఇరిగేషన్ తదితర అవసరాలకు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ఖచ్చితమైన అంచనాలతో సిద్ధం చేయాలని తెలిపారు. అన్ని శాఖలకు అవసరమైన నిధుల కేటాయింపులు, ప్రొవిజన్లకు సంబంధించిన వివరాలను తెలియజేయడంతో పాటు గ్రూపులలో కూడా షేర్ చేయడం జరిగిందని, సంబంధిత అధికారులు మరోసారి సమగ్రంగా పరిశీలించి ఏవైనా అంశాలు చేర్చవలసి ఉన్నా, ప్రతిపాదనలలో తప్పిపోయిన పనులు ఉన్నా వెంటనే వివరాలు సమర్పించాలని తెలిపారు. ప్రతి పనికి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సరైన అంచనాలు రూపొందించాలని, అంచనా వ్యయం కంటే తక్కువ మొత్తంతో ప్రతిపాదనలు పంపించి తరువాత అదనపు నిధుల కోసం ఇబ్బందులు సృష్టించవద్దని సూచించారు. ఇరిగేషన్ శాఖలో ఈ తరహా సమస్యలు తలెత్తుతున్నాయని, భూసేకరణ వంటి పనులకు సంబంధించి భూమి విస్తీర్ణం, ప్రస్తుత మార్కెట్ విలువ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైన అంచనాలు రూపొందించాలని తెలిపారు. బడ్జెట్‌లో అవసరమైన ప్రొవిజన్ ఉన్నప్పుడే సంబంధిత పనులకు టోకెన్ జనరేట్ చేసి తదుపరి ప్రక్రియ చేపట్టడం సాధ్యమవుతుందని, కాబట్టి ఏ అంశం కూడా ప్రతిపాదనలలో మిస్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పనులు పూర్తయ్యాక బడ్జెట్‌లో ప్రొవిజన్ లేదని, అవసరమైన అంశం మిస్ అయిందని తెలియజేస్తే సంబంధిత శాఖల నోడల్ అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించి గతంలో వచ్చిన విద్యుత్ ఛార్జీలను ప్రాతిపదికగా తీసుకొని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తగిన అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అదనంగా చేర్చవలసిన అంశాలపై సంబంధిత అధికారులు తమ పేరుతో మెమోరాండం సమర్పించి, అవసరమైన ప్రతిపాదనలను జత చేయవచ్చని తెలిపారు. చెన్నూర్ గోదావరి పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా సమీక్షిస్తూ, ఇప్పటికే ఎడమవైపు ఘాట్‌కు మంజూరైన పనులు, మరమ్మతులు, ఇతర సదుపాయాలను పరిశీలించి, కుడివైపు ఘాట్‌కు సంబంధించిన అవసరాలను సమగ్రంగా అంచనా వేయాలని సూచించారు. గతంలో ఆమోదించిన అంచనాలలో పొందుపరిచిన పనులు, మిగిలిన పనుల వివరాలను స్పష్టంగా పరిశీలించాలని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో మంచిర్యాల, చెన్నూర్ డివిజన్లకు సంబంధించిన అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని, జిల్లా స్థాయి ఇరిగేషన్ అధికారి 2 డివిజన్ల అధికారులతో సంప్రదించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ముఖ్యమైన పనుల సమీక్షలకు సంబంధిత శాఖల బాధ్యతాయుతమైన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఘాట్ల భద్రత, పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇప్పటికే ఉన్న నిర్మాణాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను గుర్తించాలని సూచించారు. పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి ఘాట్లు సురక్షితంగా, వినియోగానికి అనువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పనులు, అవసరాలు, అదనపు ప్రతిపాదనలను మరోసారి పరిశీలించి అవసరమైన సమర్థనతో కూడిన వివరాలను వెంటనే సమర్పించాలని, సంబంధిత పనులన్నింటిపై సమగ్ర సమీక్ష నిర్వహించి ఈ నెల 14వ తేదీలోగా ప్రతిపాదనల ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

అనంతరం మంచిర్యాల పట్టణంలో బాలాజీ ట్రేడర్స్, రవీందర్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ రఫతుల్లా అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. పచ్చి బియ్యం బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, బి.పి.టి. స్టీమ్ బియ్యం 1 వేయి 560 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ రకం బియ్యం బస్తా 1 వేయి 898 రూపాయలు, జైశ్రీరామ్ బియ్యం 2 వేల 28 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ పార్టీల సహకారం అవసరం: తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి.



మండలంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఇప్పటివరకు మండల వ్యాప్తంగా ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి 1,336 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించినట్లు వెల్లడించారు. ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని 736 మంది ఓటర్లకు ఒకటి చొప్పున మొత్తం రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులను అభినందించారు. ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రుడు ఓటు వేసేలా ప్రాముఖ్యతను ప్రతి ఒక్క ఓటర్ కు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి, బిజెపి, సిపిఎం, సిపిఐ, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమారంలో జ్యూట్, బ్యాగ్స్ తయారీ శిక్షణ కేంద్రం ప్రారంభం,





భీమారం మండల కేంద్రంలో మంగళవారం రోజున రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ తయారీ శిక్షణ కేంద్రాన్ని భీమారం సర్పంచ్ ఉష్క మల్ల విజయలక్ష్మి-పున్నం చంద్ ప్రారంభించారు, ఈ సందర్భంగా భీమారం సర్పంచ్ ఉష్క మల్ల విజయలక్ష్మి-పొన్నం చంద్, మాట్లాడుతూ భీమారం గ్రామంలోని మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్, సంస్థతో మాట్లాడి భీమారం మండల కేంద్రంలో జ్యూట్ బ్యాగ్స్, మష్రూమ్ కల్టివేషన్, కుట్టు మిషన్ శిక్షణ, కేంద్రాన్ని ప్రారంభించినట్లు, తమ సొంత నిధులతో భవనాన్ని కిరాయికి తీసుకొని కార్యక్రమాన్ని ముందుకు తీసుకొని వెళుతున్నట్టు, శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలకు భోజనం వసతి ఉంటుందని, అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇంచార్జ్ ట్రైనర్ రమాదేవి, సంపత్, తదితరులు పాల్గొన్నారు

ఎస్ ఎఫ్ ఐ నూతన కమిటీ ఎన్నిక.



పినపాక మండలంలో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు మాదాసు అఖిల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడానికి ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యా సంబంధిత సమస్యలపై విద్యార్థులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా. ఆర్ నాగ వైష్ణవి. కార్యదర్శిగా ఎస్. నేహా రెడ్డి. ఉపాధ్యక్షుడిగా కె.సంజన. సహాయ కార్యదర్శి యస్.జశ్విత ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ... తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, సంఘ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, పినపాక మండల్ ప్రెసిడెంట్ అసిఫ్, అరవింద్, కిషోర్, జశ్వంత్, చరణ్, దుర్గా శివతేజ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పుకు కృతజ్ఞతలు.. గ్రామాల అభివృద్ధికి కూటమిని మరోసారి ఆశీర్వదించండి

పాడేరు నియోజకవర్గ ప్రజలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ విజ్ఞప్తి



అల్లూరి జిల్లా ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కొయ్యూరు మండలంలో కూటమి అభ్యర్థులకు మెజారిటీతో విజయాన్ని అందించిన ప్రజలకు, ఓటర్లకు, కూటమి నాయకులు, కార్యకర్తలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కూటమి బలపరిచే సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు.కొయ్యూరు మండలంతో పాటు యావత్ పాడేరు నియోజకవర్గ ప్రజలు ఐక్యంగా నిలిచి, గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే కూటమి అభ్యర్థులను మరోసారి ఆశీర్వదించాలని ఎం.వి.వి. ప్రసాద్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి మరియు చట్టాలని ఇంప్లిమెంట్ చేయాలి






టీ జి ఎస్ ఆర్ టి సి రాణిగంజ్ డిపోలో గల నవభారత నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత దేశ కార్మికుల తలరాతను మార్చిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహానికి ఎస్సీ.ఎస్టీ, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం రోజున జ్ఞాన పూలమాల యొక్క కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది బహుజన కార్మికులు ఏకమై కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరుగుతుంది278వారం

పూలమాలము ఇప్పిచ్చినవారు సి ఎన్ కృష్ణ కండక్టర్ వాణిశ్రీ కండక్టర్ నాగలక్ష్మి కండక్టర్ బి హలో బాల రాజు రమేష్ కండక్టర్ జీవన్ శ్రామిక్ కే రవీందర్ మేకల రాజేందర్ మంత్రి కృష్ణ సుద్దాల సురేష్ ఎం గోపి మరియు వెయ్యడం జరిగినది వారం వారం ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వడం జరుగుతుంది ప్రతి ఒక్కరు జ్ఞాన పూలమాల వేయవచ్చును జై భీమ్ జై జై భీమ్ మా తలరాతలు మార్చిన మహనీయునికి పూలమాల వేస్తూ నివాళులు అర్పించిన కార్మికులు

నల్గొండలో మహిళా హోంగార్డు దారుణ హత్య

నల్గొండ (నేరవిభాగం): మహిళా హోంగార్డు దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటన నల్గొండ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి డీఎస్పీ శివరామిరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్న హోంగార్డు మహబూబ్ బీ(43)కి గతంలో హోంగార్డుగా పనిచేసిన సతీశ్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సతీశ్‌ను కొంత కాలం క్రితం విధుల్లోంచి తొలగించారు. మంగళవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లిన తర్వాత దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మహబూబ్ బీపై సతీశ్ దాడి చేశాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. సమచారం అందుకున్న డీఎస్పీ శివరామిరెడ్డితో పాటు సీఐ ఆదిరెడ్డి, రూరల్ ఎస్సై శివప్రసాద్, వన్‌టౌన్ ఎస్సై నాంపల్లి వెంకట్ నారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ట్రైనెట్ న్యూస్ తెలంగాణ
నిజం • భాద్యత • నిబద్ధత
సినిమా తెలుగు దిన పత్రిక
బుధవారం నవంబర్ 11, 2026
www.trinetnews.com



అలా జరగడం కూడా మంచిదే.. ఎన్నో పాఠాలు నేర్చుకున్నా: సమంత

జీవితంలో అపజయాలే ఎక్కువగా నేర్పిస్తాయన్నారు నటి సమంత తాజాగా ఓ షోలో పాల్గొన్న ఆమె.. వ్యాపారంలో విఫలమైన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆ ఓటమి తనకు విజయాల కంటే ఎక్కువ పాఠాలు నేర్పిందన్నారు. “నా తొలి వ్యాపార భాగస్వామ్యం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే, మొదటిసారి పెట్టుబడి పెట్టిన వ్యాపారం విఫలమవడం కూడా మంచిదే. ఎందుకంటే, విజయాల కంటే అపజయాలే ఎక్కువ నేర్పిస్తాయి. నా జీవితంలో నేర్చుకున్న పాఠాలన్నీ వైఫల్యాల నుంచి వచ్చినవే. విజయాలు నాకు పెద్దగా ఏమీ నేర్పించలేదు” అని ఆమె చెప్పుకొచ్చారు. ఇదే షోలో వ్యాపార రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపైనా ఆమె మాట్లాడారు. “కొత్తగా ఏదైనా ప్రారంభించాలంటే మహిళల్లో భయం ఎక్కువగా ఉంటుంది. మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడం నాకు కొత్త అనుభవం. ఇప్పటివరకు నేను దాదాపు 8 నుంచి 10 వ్యాపార సంస్థల్లో పెట్టుబడి పెట్టాను. వాటిలో ఎనిమిది సంస్థలకు మహిళలే వ్యవస్థాపకులుగా ఉండడం సంతోషకరమైన విషయం” అని తెలిపారు. త్వరలో తొలి బిడ్డకు జన్మనివ్వనున్న సమంత.. ప్రస్తుతం ‘సెలబ్రిటీ మాస్టర్‌షెఫ్ తమిళం’ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



ఒకే ఏడాదిలో 3 సినిమాలు హిట్.. సూర్య రికార్డు!


ఓ అగ్ర కథానాయకుడు ఒకే ఏదాదిలో మూడు సినిమాల్లో నటించడం, ఆ మూడూ హిట్ కావడమంటే విశేషమే కదా. ప్రముఖ నటుడు సూర్యకు అలాంటి ఘనతే దక్కబోతోంది. ఒకే ఏడాదిలో రూ.200 కోట్లు వసూలు చేసిన మూడు చిత్రాల్లో నటించిన తమిళ హీరోగా అతిత్వరలో ఆయన రికార్డు సృష్టించబోతున్నారు.

ఈ ఏడాది మే నెలలో సూర్య నటించిన కరుప్పు (వీరభద్రుడు), ఆగస్టులో విశ్వనాథ్ అండ్ సన్స్ విడదల కాగా, దీపావళి కానుకగా సీన్ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్ సూపర్ హిట్ చిత్రాలుగా నిలవగా, సీన్ కూడా ప్రేక్షకాదరణతో మంచి వసూళ్లు రాబట్టుతోంది. కరుప్పు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.310 కోట్లు వసూలు చేయగా, విశ్వనాథ్ అండ్ సన్స్‌కు రూ.209 కోట్లు వచ్చాయి. ‘సీన్’ ఇప్పటివరకూ రూ.154 కోట్లు సాధించింది. ప్రస్తుతం ఆ చిత్రానికి వస్తున్న స్పందనను చూస్తే, ఈ వారాంతానికి రూ.200 కోట్లు వసూలు చేయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అంటే త్వరలోనే ఆయనకు ఈ ఏడాదిలో రూ.200 కోట్లు వసూళ్లు అందించిన మూడో చిత్రంగా ‘సీన్’ నిలవబోతోంది.

రావణుడి పాత్ర... యశ్ ఎన్ని కిలోల కాస్ట్యూమ్స్ ధరించారో తెలుసా?

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ‘రామాయణ’ మిశ్రమ స్పందనలు అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద మాత్రం దూసుకెళ్తోంది. ముఖ్యంగా రావణుడి పాత్రలో యశ్ నటనకు ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన లుక్ గురించి చిత్ర కాస్ట్యూమ్ డిజైనర్ సానియా సర్ధారియా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ పాత్ర కోసం యశ్ ధరించిన దుస్తులు, ఆభరణాల బరువు ఏకంగా 33 కిలోలు ఉందని ఆమె వెల్లడించారు

“ఈ సినిమాలో యశ్ సాధారణంగా ధరించిన దుస్తులు, ఆభరణాల బరువు 16 నుంచి 20 కిలోల వరకు ఉంటుంది. లంకకు సంబంధించిన రావణుడి లుక్, వివాహ వేడుకల కోసం రూపొందించిన కొన్ని ప్రత్యేక దుస్తుల బరువు మాత్రం





30-33 కిలోల వరకు ఉండేది. ఆయన ధరించిన కిరీటం ఒక్కటే 1.8 కిలోల బరువు ఉంటుంది” అని ఆమె తెలిపారు.

మరోవైపు రావణుడి ఆభరణాల రూపకల్పన గురించి అమ్రపాలి సంస్థ క్రియేటివ్ డైరెక్టర్, సీఈఓ తరంగ్ అరోధా మాట్లాడారు. రావణుడి లంకను అత్యంత సంపదతో కూడిన రాజ్యంగా చూపించేందుకు ఆభరణాల రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. రావణుడి వ్యక్తిత్వంలోని భిన్న కోణాలు ప్రతిబింబించేలా ఆభరణాలను రూపొందించినట్లు ఆయన వివరించారు.

ఇక, కలెక్షన్ల విషయానికొస్తే.. ‘రామాయణ’ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.663.90 కోట్ల వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నవంబర్ 9 (సోమవారం)న భారత్‌లో రూ.107.50 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టగా.. దేశీయంగా మొత్తం రూ.346.35 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. తొలి సోమవారం వసూళ్ల విషయంలో ‘దంగల్’, ‘బాహుబలి 2’, ‘పుష్ప 2’ వంటి చిత్రాల రికార్డులను ఈ చిత్రం అధిగమించడం విశేషం.

సూర్య నటనపై మహేశ్‌బాబు ప్రశంసలు.. ‘సీన్’ తప్పక చూడాల్సిన సినిమా!



తమిళ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం ‘సీన్’పై టాలీవుడ్ అగ్రకథానాయకుడు మహేశ్‌బాబు ప్రశంసల వర్షం కురిపించారు. సినిమాలో సూర్య నటన అద్భుతంగా ఉందని కొనియాడారు.

“సీన్ సినిమా చూశాను. అద్భుతంగా ఉంది. చాలా కూల్‌గా, తెలివిగా, సరదాగా సాగిపోయింది. సూర్య తన పాత్రలో గొప్పగా నటించాడు. నజ్రియా, నస్లేన్ అద్భుతంగా చేశారు. జిత్తు మాధవన్ రచన, తెరకెక్కించిన విధానం చాలా బాగున్నాయి. ప్రతి విభాగంలోనూ సినిమా ఆకట్టుకుంది. కచ్చితంగా చూడాల్సిన చిత్రాల్లో సీన్ ఒకటి” అంటూ మహేశ్‌బాబు ప్రశంసించారు. జిత్తు మాధవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూర్య పోలీస్ అధికారిగా నటించారు. క్రైమ్, కామెడీ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకొచ్చింది. విడుదలైన తొలి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద జోరు చూపించింది.



ముందు అమ్మ ఒప్పుకోలేదు!

సినిమాల్లోకి రావాలన్న తన నిర్ణయంపై ఆమె తల్లి, దివంగత నటి శ్రీదేవి మొదట అంత ఆసక్తి చూపలేదని అన్నారు బాలీవుడ్ కథానాయిక జాన్వీ కపూర్. ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో తన తల్లితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటుంటారు జాన్వీ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సినిమాల్లోకి రావాలన్న నిర్ణయంపై తన తల్లి సూచనల గురించి పలు ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు.

“నేను సినిమాల్లో నటించాలన్న నిర్ణయాన్ని అమ్మకు చెప్పినప్పుడు మొదట ఆమె పూర్తిగా ఒప్పుకోలేదు. సినిమా రంగంలో ఉండాలంటే జీవితాంతం నటనకే అంకితమై ఉండాలన్నారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి, పూర్తి నిబద్ధతతో పనిచేయాలని అమ్మ చెప్పారు. అంతకు ముందు ఆమెకు నాపై అంత నమ్మకం ఉండేది కాదు. కానీ, నా ముక్కు సర్జరీ తర్వాతే అమ్మ నాలో నటిగా కొనసాగే లక్షణాలు ఉన్నాయని సినిమాల్లోకి రావడానికి అంగీకరించారు” అని చెప్పారు జాన్వీ.



అరేబియా షేర్

కథానాయకుడు ధనుష్, అగ్రహీరో మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ‘ఓం’. సాయి పల్లవి, శ్రీలీల కథానాయికలు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. శ్రద్ధా అగర్వాల్, ధనుష్, అజ్మత్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఇటీవల ఈ సినిమా నుంచి ‘షేర్ ఆఫ్ అరేబియా..’ అంటూ సాగే పాటని విడుదల చేసింది. స్టైలిష్ లుక్కుల్లో మమ్ముట్టి, ధనుష్‌ల స్వాగ్‌తో కూడిన సన్నివేశాలతో సాగుతున్న ఈ పాట ఆకట్టుకుంటుంది. ఈ గీతాన్ని సాయి అభ్యంకర్ స్వరపరిచి తమిళ అధవన్‌తో కలిసి ఆలపించారు.

కాకా వేట షురూ

‘వాల్తేరు వీరయ్య’ విజయం తర్వాత కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కొల్లి కలయికలో రూపొందుతున్న కొత్త సినిమా ‘కాకా’. వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్, అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే దీపావళి సందర్భంగా ఈ సినిమా నుంచి కొత్త లుక్‌ని విడుదల చేశారు. అందులో చిరు వర్షంలో పచ్చని పొలాల మధ్య వేట కొడవలి పట్టుకుని యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా కనిపించారు. ఇది తండ్రీ - కూతుళ్ల అనుబంధాలతో ముడిపడిన భారీ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. చిరంజీవి ఇందులో రెండు కోణాలున్న పాత్రలో అలరించనున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: విజయ్ కార్తీక్ కన్నన్.



మంచిర్యా జిల్లాలో బ్యాంకింగ్ సేవలను విస్తరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణ సదుపాయాలు కల్పించాలి,

రైతులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





జిల్లాలో బ్యాంకింగ్ సేవలను విస్తరించి, బ్యాంకింగ్ సదుపాయాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఆర్థిక సేవలను చేరువ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ నటరాజ్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్ డి.ఓ శ్రీనివాస్ వెన్న, నాబార్డ్ డి.డి.ఎం. వీరభద్రుడు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రితేష్, ఎ.డి.సి.సి.సి. సి.ఈ.ఓ. విశ్వేశ్వర్ లతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా తలసరి ఆదాయం, పారిశ్రామిక రంగం, మైనింగ్ వంటి రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. బ్యాంకింగ్ సదుపాయాలు తక్కువగా ఉన్న ప్రాంతాలు, బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాలు, ప్రత్యేకించి పి.వి.టి.జి. జనాభా నివసించే ప్రాంతాలలో ఆర్థిక సమ్మిళితాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ క్రమంలో గుర్తించిన 135 ప్రాంతాలతో పాటు మరో 400కు పైగా ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవల విస్తరణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు ఆర్థిక సమ్మిళిత బాధ్యతను స్వీకరించి సేవలను విస్తరించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం నష్టపోయే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కల్పించే అనుబంధ వ్యవసాయ రంగ కార్యకలాపాలను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు మరింత అండగా బ్యాంకింగ్ సేవలు అందించాలని, కరువు పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ, అనుబంధ దీర్ఘకాలిక రుణాలను రీ షెడ్యూల్ చేసి రైతులకు అందించాలని, అవసరం ఉన్న రైతులకు అర్హతలను పరిశీలించి అదనపు రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు, ఇతర స్వల్పకాలిక రుణాలకు అర్హత కలిగిన రైతుల దరఖాస్తులను సానుకూల దృక్పథంతో పరిశీలించి రుణ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కరువు పరిస్థితుల కారణంగా రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఆర్.బి.ఐ, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ, సంబంధిత బ్యాంకుల మార్గదర్శకాల ప్రకారం స్వల్పకాలిక పంట రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా పునర్వ్యవస్థీకరించే చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా రైతులకు రుణ చెల్లింపులలో వెసులుబాటు కలిగి, తిరిగి ఆర్థికంగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రుణాల చెల్లింపులు, రీపేమెంట్ తదితర అంశాలలో సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత బ్యాంకర్లు, సెర్ప్, మెప్మా సిబ్బంది సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రుణాల వసూళ్లు, ఇతర సమస్యల విషయంలో ఇబ్బందులు ఎదురైతే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. బ్యాంకులు ఆర్థికంగా ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు, మంచి క్రెడిట్ చరిత్ర కలిగిన వ్యక్తులు, కష్టపడి పనిచేసి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునే సామర్థ్యం ఉన్న సంస్థలకు రుణాలు అందించాలని సూచించారు. రుణ దరఖాస్తులను తిరస్కరించే సందర్భంలో స్పష్టమైన కారణాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, తిరస్కరణకు గల కారణాలు తెలియజేస్తే వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యా రుణాలు, ఇతర అవసరాల కోసం రుణాలు కోరే విద్యార్థులు, అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించాలనుకునే విద్యార్థులకు రుణ సదుపాయాలు కల్పించి వారి భవిష్యత్తుకు తోడ్పడాలని తెలిపారు. బ్యాంకులు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించడంతో పాటు, వ్యాపార ప్రతినిధుల సేవలను కొనసాగించి మరింత పెంచాలని సూచించారు. బి.సి. కేంద్రాలను మూసివేయకుండా, బ్యాంకింగ్ సదుపాయాలు లేని ప్రాంతాలలో వాటి సంఖ్యను పెంచాలని తెలిపారు. జిల్లాలో కేవలం ఒకటి, రెండు శాఖలతోనే పరిమితమై వ్యాపారాన్ని విస్తరించాలని భావిస్తే ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధ్యం కాదని, గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను విస్తరించడం ద్వారా ప్రజలకు ప్రయోజనం కలగడంతో పాటు బ్యాంకులకు డిపాజిట్లు, ఇతర వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. జిల్లాలోని బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ప్రజలు, రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు, ఇతర వర్గాలకు మెరుగైన ఆర్థిక సేవలు అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పినపాక విద్యార్థిని ఎంపిక.

- అండర్--17 విభాగంలో ప్రతిభ చాటిన ఎల్జిరెడ్డిపల్లి విద్యార్థిని టి. సుజాత.



గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ క్రమంలో పినపాక మండలం,ఎల్జిరెడ్డిపల్లి ఏజీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని టి. సుజాత అండర్--17 ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.ఈ నెల 12వ తేదీ 2026న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సుజాత పాల్గొననుందని పాఠశాల పీడీ విజయ తెలిపారు. ఖోఖో క్రీడలో తన ప్రతిభ, పట్టుదలతో ముందుకు సాగిన సుజాత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సుజాతను అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని, పాఠశాలతో పాటు పినపాక మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత తప్పనిసరి: సర్పంచ్ సనప అనిత.



రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత పెరిగి భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక మండలం, సీతారాంపురం గ్రామ సర్పంచ్ సనప అనిత అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకునేందుకు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరని ఆమె సూచించారు.

సీతారాంపురం, పెంటన్నగూడెం గ్రామాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షపు నీరు వృథాగా కాలువల్లోకి, రోడ్లపైకి వెళ్లకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్యలను కొంతవరకు నివారించవచ్చని వివరించారు.

నీటి వనరులను కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రజలు, ఇంటి యజమానులు, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. నీటి పొదుపు అలవాటుగా మారినప్పుడే భావితరాలకు నీటి భద్రత కల్పించగలమన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్పృహ కోల్పోలేదని నిర్లక్ష్యం చేయొద్దు.. మెదడుపై రక్తపు గడ్డ ఒత్తిడి

అత్యవసర శస్త్రచికిత్సతో చింతపల్లి మహిళకు పునర్జన్మ తలకు గాయమైతే రోజుల తర్వాత కూడా తీవ్ర పరిణామాలు





రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైనప్పటికీ స్పృహ కోల్పోకపోవడంతో పెద్దగా ప్రమాదం లేదని భావించిన ఓ మహిళకు, కొంతకాలం తర్వాత మెదడుపై రక్తపు గడ్డ ఒత్తిడి కలిగిస్తున్నట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. దీంతో మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యవసరంగా మెదడు శస్త్రచికిత్స నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడారు. చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామానికి చెందిన జల్లాల మల్లమ్మ (49) ఈ ప్రమాదం నుంచి కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. సెప్టెంబర్ 16న ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుని ప్రయాణిస్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మల్లమ్మ తల, ముఖం, కుడి చేతికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె స్పృహలోనే ఉన్నారు. అయితే వైద్య పరీక్షల్లో భాగంగా నిర్వహించిన సీటీ స్కాన్‌లో మెదడుకు ఎడమవైపు ఫ్రంటల్ ప్రాంతంలో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించారు. ఈ రక్తపు గడ్డ మెదడుపై తీవ్ర ఒత్తిడి కలిగించడంతో పాటు మెదడును మధ్య రేఖ నుంచి పక్కకు నెట్టినట్లు వైద్యులు గుర్తించారు.

దీంతో పరిస్థితి తీవ్రతను గుర్తించిన సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని వైద్య బృందం సెప్టెంబర్ 17న అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించింది. లెఫ్ట్ టెరియోనల్ క్రేనియోటమీ ద్వారా మెదడుపై ఒత్తిడి కలిగిస్తున్న రక్తపు గడ్డను తొలగించారు. అనంతరం పుర్రె ఎముక భాగాన్ని టైటానియం ప్లేట్లు, స్క్రూల సహాయంతో తిరిగి అమర్చారు.

శస్త్రచికిత్స అనంతరం మల్లమ్మ కుడి ఊపిరితిత్తి చుట్టూ గాలి చేరడంతో వైద్యులు ఛాతీలో డ్రెయిన్ అమర్చి చికిత్స అందించారు. పరిస్థితి మెరుగుపడిన తర్వాత డ్రెయిన్‌ను తొలగించారు. అనంతరం నిర్వహించిన సీటీ స్కాన్‌లో మెదడుపై ఒత్తిడి పూర్తిగా తగ్గడంతో పాటు మెదడు మధ్య రేఖ పక్కకు జరగడం కూడా సరిచేయబడినట్లు నిర్ధారించారు. దీంతో సెప్టెంబర్ 22న ఆమెను స్పృహతో, స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. తలకు గాయమైనప్పుడు బాధితులు స్పృహ కోల్పోకపోయినా అంతర్గతంగా మెదడులో రక్తస్రావం లేదా రక్తపు గడ్డ ఏర్పడే ప్రమాదం ఉంటుందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో గాయం జరిగిన వెంటనే కాకుండా రోజుల తర్వాత కూడా తీవ్రమైన సమస్యలు బయటపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల తలకు దెబ్బ తగిలినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ద్విచక్ర వాహన ప్రమాదాల నుంచి తలకు తీవ్రమైన గాయాలు కాకుండా ఉండేందుకు వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర సూచించారు.

ప్రభుత్వ పాఠశాల నందు నేత్ర వైద్య శిబిరం.

- 135 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు.



విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పినపాక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 135 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారి దృష్టి సామర్థ్యాన్ని పరిశీలించారు.

పినపాక ఆప్తాల్మిక్ ఆఫీసర్ సంజీవరావు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఒక విద్యార్థికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వైద్య సలహాలు, తదుపరి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ శిబిరాన్ని పినపాక మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.పాఠశాల స్థాయిలో ఇలాంటి వైద్య శిబిరాల నిర్వహణ విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రారంభ దశలోనే అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నాయబ్ తహసీల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అరుణ్‌బాబు, ప్రవీణ్‌కుమార్, నరసింహ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండల సభలో అజెండా కరువు

విలేకరులకు అజెండా ప్రతులు ఇవ్వని అధికారులు.. తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారనే విమర్శలు



కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో (రైతువేదిక)లో నిర్వహించిన మండల సభ అధికారుల తీరుపై పలు విమర్శలకు తావిచ్చింది. మండల సభకు సంబంధించిన అజెండా ప్రతులను విలేకరులకు అందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనే కీలక సమావేశానికి సంబంధించిన అంశాలు ముందుగా తెలియజేయకపోవడంతో సభ నిర్వహణ తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రేషన్ కార్డులు, రెవెన్యూ, విద్య, వైద్యం తదితర అంశాలపై సమగ్ర చర్చ జరగాల్సి ఉండగా, సమావేశం కేవలం మొక్కుబడిగా సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాల్సిన మండల సభలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు బాధ్యతలపై పారదర్శకత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సమావేశానికి సంబంధించిన అజెండా, తీర్మానాలు, సమావేశపు మినిట్స్ వంటి సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

సమావేశాల నిర్వహణలో పారదర్శకత, ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండటం ప్రజాస్వామ్య పాలనలో కీలకం ఇకనైనా అధికారులు మండల సభల అజెండా, తీర్మానాలు, సమావేశ వివరాలను ప్రజలకు, మీడియాకు అందుబాటులో ఉంచి జవాబుదారీతనంతో వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టాలి,

మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,





జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి, ఆదిలపేట, పొన్నారం గ్రామపంచాయతీల పరిధిలో వి బి జి రామ్ జి పథకం క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. సారంగపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మురుగు కాలువలు, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్, సి.సి. వర్క్‌సైట్ పనులు, ఆదిల్ పేట గ్రామపంచాయతీలోని పి.టి. వర్క్‌సైట్‌ను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలైన ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల నిర్వహణ తనిఖీ చేశారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని అవగాహన కల్పించారు. 3 గ్రామపంచాయతీల పరిధిలో పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ రీఛార్జ్ స్ట్రక్చర్లు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాలలోని వి.ఓ. భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. గ్రామాలలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి సమస్యల నివారణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రానున్న రోజులలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, కరువు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. గ్రామాలలో నీటి వనరుల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఎ.ఈ.లు., ఉపాధి హామీ ఎ పి ఓ, ఈ.సి., టి.ఎ., పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి

విద్యా, గృహ, ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలి
ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలి..
కరువును జయించేందుకు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలి
రైతులకు రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు రబీకి కొత్త రుణాలు అందించాలి
ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. అర్హులైన రైతుల పంట రుణాలను ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రీషెడ్యూల్ చేయడంతో పాటు రబీ సీజన్‌కు అవసరమైన కొత్త రుణాలను సకాలంలో అందించాలని సూచించారు. రైతులకు రుణాల మంజూరులో జాప్యం చేయకుండా క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు చొరవ చూపాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విద్యా రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండి అర్హులైన విద్యార్థులకు గరిష్ఠ స్థాయిలో రుణాలు అందించాలని కోరారు. విద్యా రుణాల మంజూరుపై ఎస్ఎల్బీసీ కన్వీనర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. వ్యక్తిగత గృహ నిర్మాణానికి రుణాలు అందించడంలోనూ బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గృహ నిర్మాణ సంస్థలకు రుణాలివ్వడానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు వ్యక్తిగత గృహ రుణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), మౌలిక సదుపాయాల రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే ఎంఎస్ఎంఈ రంగం ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోందని, ఈ రంగానికి రుణాల పెంపు ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి సేవల రంగం వృద్ధికి కీలకమని, ఈ రంగానికి తగిన స్థాయిలో రుణాలు అందించాలని సూచించారు.

ఎల్నినో ప్రభావం కేవలం తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల పెట్టుబడులు, ఆదాయాలు దెబ్బతిన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తక్షణ సహకారం అవసరమని పేర్కొన్నారు. విఫలమైన రుతుపవనాల ప్రభావం రైతుకు, బ్యాంకుకు మధ్య ఉన్న సంబంధాన్ని దెబ్బతీయకూడదన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ ఉపశమన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు



సమన్వయంతో పనిచేసి ఆర్బీఐ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. గత రుణాల రీషెడ్యూలింగ్‌తో పాటు అర్హులైన రైతులకు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యం, నిల్వ, ప్రాసెసింగ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా రుణాలు, మార్కెట్ మద్దతు కల్పించాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందన్నారు.

కరవు పరిస్థితుల్లో వ్యవసాయంపై మాత్రమే ఆధారపడకుండా రైతు కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించేందుకు బ్యాంకులు సహకరించాలని కోరారు. ఈ సీజన్‌లో కనీసం 10 నుంచి 15 శాతం కుటుంబాలకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నగదు చలామణి పెరిగేలా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, ఇప్పటికే ఉన్న రుణ లక్ష్యాలకు అదనంగా ఒక్కో సంఘానికి మరో రూ.2 లక్షల వరకు రుణాలు అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని ఈ నెలలో అమలు చేసేందుకు చర్యలు చేపడుతోందని, ఈ నెల 19 నాటికి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేలా ఎస్ఎల్బీసీ కన్వీనర్ ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

రాష్ట్రంలో అక్టోబర్ 16న విద్యుత్ డిమాండ్ 20,818 మెగావాట్లకు చేరడం చరిత్రలోనే అత్యధికమని తెలిపారు. వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు, విద్యుత్ వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో పాటు రైతుల రుణ చెల్లింపు సామర్థ్యంపైనా ప్రభావం పడుతోందన్నారు. ఈ సంక్షోభాన్ని అన్ని రంగాలూ సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకుల ఆచరణాత్మక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రైతులు తదుపరి వ్యవసాయ సీజన్‌ను కొత్త ఆత్మవిశ్వాసంతో ప్రారంభించగలగడమే ఈ ప్రయత్నాల విజయానికి కొలమానమని పేర్కొన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలి: తుమ్మల

సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సాధారణ బ్యాంకింగ్ కార్యకలాపాలకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులకు అండగా నిలవాలని సూచించారు. కరువు ప్రభావిత మండలాల్లో పంట రుణాలను ఆర్బీఐ నిబంధనల ప్రకారం వెంటనే రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేయాలని, రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బ్యాంకర్లే ముందుకు రావాలని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది కృష్ణా, గోదావరి నదులకు వరదలు రాకపోవడంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. భూగర్భ జలాలు కూడా ఆశించిన స్థాయిలో రీచార్జి కాకపోవడంతో సుమారు 10 నుంచి 15 లక్షల బోరుబావుల్లో నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ప్రభావం ఖరీఫ్‌తో పాటు రబీ పంటలపైనా పడే అవకాశం ఉన్నందున రైతులను ఆదుకునేందుకు బ్యాంకులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సుమారు రూ.21 వేల కోట్ల పంట రుణమాఫీని అమలు చేసిందని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించిందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, సాగునీరు, విద్యుత్, సబ్సిడీ తదితర రంగాలతో కలిపి వ్యవసాయంపై రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం తన వంతు బాధ్యతగా రైతులకు అండగా నిలుస్తోందని, బ్యాంకర్లు కూడా అదే స్ఫూర్తితో సహకరించాలని కోరారు. రబీ సీజన్‌కు బ్యాంకులు నిర్దేశించుకున్న రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. 2026 సెప్టెంబర్ వరకు రూ.96,943 కోట్ల రుణ పంపిణీ లక్ష్యంలో 53 శాతం మాత్రమే సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మాన్‌సూన్ ఫార్మింగ్ రుణాల పంపిణీ కూడా లక్ష్యంలో 17 శాతానికే పరిమితమైందని, ఈ పరిస్థితిని అధిగమించి రుణాల మంజూరులో వేగం పెంచాలన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని, రైతులకు అవసరమైన పెట్టుబడి రుణాలు అందించాలని కోరారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ సాగుకు విరివిగా రుణాలు ఇవ్వాలని, వాణిజ్య బ్యాంకులు కూడా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రాష్ట్రంలో ఇప్పటికే 3.5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టామని, ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు బ్యాంకులు సహకరించాలని మంత్రి కోరారు. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, పశు పోషణ, తేనెటీగల పెంపకం వంటి వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించడం ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించవచ్చన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), మహిళా స్వయం సహాయక సంఘాలకు కూడా రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

రైతులు తిరిగి పంటలు సాగు చేసి ఆదాయం పొందే వరకు వడ్డీ భారం పడకుండా ఆర్బీఐ నిబంధనల ప్రకారం రుణాల రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేపట్టాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితులను ప్రభుత్వం, బ్యాంకర్లు సమష్టిగా ఎదుర్కొని రైతాంగాన్ని కాపాడుకోవాలని తుమ్మల పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాహుల్ బొజ్జా, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, కె. సురేంద్ర మోహన్ గారు, ఎస్ఎల్బీసీ (గ్రామీణ) బ్యాంకర్లు మానస గంగోత్రి, చిన్మయ్ కుమార్, ఉదయ్ భాస్కర్, నలేష్ నీలేష్ ద్వివేది, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన సమగ్ర భూ రీసర్వేలి

భూ యజమానుల ప్రయోజనాలే సర్వేలో అత్యంత ప్రాధాన్యత
రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే ప్రక్రియ ప్రారంభించాలి
సర్వే అనంతరం భూ యజమానులకు నోటీసులు జారీ చేసి అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించాలి
రైతులకు సర్వే ప్రక్రియ, అభ్యంతరాల నమోదు, పరిష్కారంపై విస్తృత అవగాహన కల్పించాలి
చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదానికి కారణం కాకూడదు
ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులు.. కచ్చితమైన హద్దులు కల్పించడమే లక్ష్యం
తరతరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
రీసర్వే పురోగతిపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్
రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను



అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ సర్వే పురోగతిపై మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో రీసర్వే మైలురాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.

125 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యత, పారదర్శకత, కచ్చితత్వం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి అధికారులకు సూచించారు.

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే ప్రారంభించాలి

గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించడానికి ముందుగా ఆ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి, రికార్డుల్లో ఉన్న వివరాలు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను ప్రారంభించాలి.

సర్వే అనంతరం భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలి

సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలి. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, ఏవైనా అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే తెలియజేసేందుకు వారికి తగిన అవకాశం కల్పించాలి, భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.

అభ్యంతరాల నమోదు, పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించాలి

సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సర్వే అనంతరం భూ యజమానులకు ఎలాంటి నోటీసులు జారీ చేస్తారు? అభ్యంతరాలను ఎలా నమోదు చేయాలి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అనే అంశాలపై గ్రామస్థాయిలో రైతులకు, భూ యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. సర్వే ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి.

భూ యజమానుల సంతృప్తే సర్వే విజయానికి ప్రామాణికం

సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదు. ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలి. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలి. భూ యజమానులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి.

చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో వివాదానికి కారణం కాకూడదు

రీసర్వే ప్రారంభ దశలోనే ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు, లోపాలు గుర్తించినట్లయితే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలి. ఒక్క చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో మరో భూ వివాదానికి దారితీయకూడదు. సర్వేలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ కచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

భూదార్ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ కేటాయింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి. భూముల వివరాలు, హక్కులు, సరిహద్దులకు సంబంధించి స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలి. రాష్ట్రంలో ఇకపై కొత్తగా భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి.

తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

భూముల హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణాలకు సంబంధించి అనేక సమస్యలు తరతరాలుగా కొనసాగుతున్నాయి. తమ జీవితకాలంలో కూడా ఈ సమస్యలకు పరిష్కారం లభించదనే నిరాశలో ఎంతోమంది భూ యజమానులు ఉన్నారు. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతున్న ఈ సమస్యలకు సమగ్ర భూ రీసర్వే ద్వారా శాశ్వత ముగింపు పలకాలి. భవిష్యత్తు తరాలకు భూ వివాదాలు లేని తెలంగాణను అందించడమే ఈ చారిత్రాత్మక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి, అధికారులకు తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.

ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

హైదరాబాద్, రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ నవంబరు 10 :



వాలేరియన్ గ్రామర్ హైస్కూల్‌లో 1976లో పదో తరగతి తొలి బ్యాచ్‌లో ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులు తమ పాఠశాల విద్యాభ్యాసానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులతో పాటు గతంలో వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు, ప్రస్తుత పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్ వినయ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, విద్యార్థి దశలో ఎదురైన అనుభవాలను, మధుర స్మృతులను పరస్పరం పంచుకున్నారు. తమను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా మార్గదర్శనం చేసిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు . ఉపాధ్యాయుల కృషి, బోధన, క్రమశిక్షణ తమ జీవితాలపై ఎంతో ప్రభావం చూపాయని పేర్కొన్నారు.

పూర్వ ఉపాధ్యాయులు తమ విద్యార్థులు జీవితంలో విజయాలు సాధించి ఉన్నత స్థాయిలో ఎదగడం పట్ల ఆనందం, సంతృప్తి వ్యక్తం చేశారు. తమ విద్యార్థుల విజయాలు ఉపాధ్యాయులుగా తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్ వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు తమ పాఠశాల పట్ల చూపిస్తున్న అపారమైన ప్రేమ, అభిమానాలు, కృతజ్ఞతాభావం తనను ఎంతో భావోద్వేగానికి గురిచేశాయన్నారు. విద్యార్థులు ఐదు దశాబ్దాల తర్వాత కూడా పాఠశాలను, ఉపాధ్యాయులను గుర్తుచేసుకుని ఇంత ఆత్మీయంగా వేడుక నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

అనంతరం వినయ్ రెడ్డి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ గోల్డెన్ జూబ్లీ వేడుకకు వెంకటేశ్వర్ రావు సమన్వయకర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో కెప్టెన్ తేజేందర్ పాల్ సింగ్, ఉదయ్ రాజ్, సురేందర్, ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 19న సిద్దిపేటలో... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ

సభా స్థలాలను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి
5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభం

సిద్దిపేట, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సభా స్థలాల కోసం పలు ప్రాంతాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి క్షేత్రస్థాయిలో



పరిశీలించారు. ఈ సందర్భంగా సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, రాకపోకలకు అనువైన మార్గాలపై అధికారులతో చర్చించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

భూ భారతి ఆపరేటర్లకు వేతనాలు చెల్లించండి

రెవిన్యూశాఖ కార్యదర్శిని ఆదేశించిన హెచ్ఆర్సీ

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

భూభారతి ఆపరేటర్లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. కామారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన పి. లింగం తెలంగాణ రెవెన్యూ శాఖ పరిధిలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న భూభారతి ఆపరేటర్లకు గత ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన హెచ్ఆర్సీ విచారించి సుదీర్ఘకాలంగా వేతనాలు చెల్లించలేదని గుర్తించి భూ భారతి ఆపరేటర్లకు వెంటనే ఎలాంటి వేతన బకాయిలు లేకుండా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ శాఖ కార్యదర్శిని ఆదేశించింది.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



అందెశ్రీ రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆయన ఆశయాలు, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:


అందెశ్రీ సేవలు, రచనలు, పాటలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, తెలంగాణ సమాజానికి, సాహిత్యానికి తీరని లోటు అని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన అందెశ్రీ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి జూపల్లి పాల్గొని, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో తన రచనలు, పాటల ద్వారా యావత్ తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఉద్యమానికి స్ఫూర్తిని నింపిన ప్రజాకవి అందెశ్రీ అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ తన కలం, గళం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని, ఆయన పాటలు తూటాల్లా పేలి ఉద్యమానికి కొత్త ఊపిరి పోశాయని అన్నారు. తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేయడంలో ఆయన రచనలు, పాటలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. కవులు, సాహితీవేత్తలు ఎన్ని పుస్తకాలు రచించారన్నది ముఖ్యం కాదని, వారి రచనలు సమాజానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయి, ప్రజల్లో ఎంతటి జాగృతిని, చైతన్యాన్ని తీసుకొచ్చాయన్నదే అసలైన కొలమానమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆ కోణంలో చూస్తే అందెశ్రీ అత్యున్నతమైన ప్రజాకవిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

అందెశ్రీ ఆలోచనా విధానం, ఆశయాలను కవులు, కళాకారులు, సాహితీవేత్తలు కొనసాగించాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలన్న ఆయన ఆకాంక్షలను మన జీవన విధానంలో, ఆలోచనా విధానంలో భాగం చేసుకుని ముందుకు సాగినప్పుడే అందెశ్రీకి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని జూపల్లి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అరుణోదయ విమలక్క, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్, తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అఖండ భారత దేశం కోసం ఉద్యమించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ : కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబరు 10:

అఖండ భారత దేశం నినాదం తో ఉద్యమించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి చట్టం విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు ఒకే దేశం, ఒకే ప్రధాన్, ఒకే నిషాన్ అన్న సిద్ధాంతం ను సమర్థించిన మహోన్నతమైన వ్యక్తి డా. శ్యామ్ ప్రసాద్ అని చెప్పారు భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
రీత్ కళా సంఘం ఆధ్వర్యంలో
డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి. కిషన్ రెడ్డి. గౌరవ అతిథులుగా ప్రముఖ టాలీవుడ్ నటుడు డా. సుమన్ తల్వార్, ప్రముఖ ఒడిస్సీ నృత్య కళాకారిణి డా. సుభశ్రీ పట్నాయక్, నటుడు జెమినీ సురేష్, నటి సంధ్య జనక్, ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్, అథ్లెట్ అను ప్రసాద్ లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెహ్రూ తప్పుడు ఆలోచన విధానాలను వ్యతిరేకించారని తెలిపారు. 74 ఏళ్ల తర్వాత 370 ఆర్టికల్ ను రద్దు చేయడంతో ముఖర్జీ ఆత్మకు శాంతి చేకూరిందని తెలిపారు. అంతకు ముందు ముఖర్జీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రముఖ కళాకారులు, నృత్య గురువులు, వివిధ నృత్య అకాడమీలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. డా. సుభశ్రీ పట్నాయక్ ఒడిస్సీ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే గురు డి. బాలాజీ బృందం, లక్ష్మీ కూచిపూడి డాన్స్ అకాడమీ, గురు అనన్య రెడ్డి బృందం, గురు వందన వెంకట్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డా. శ్రీనివాస రావు బృందం ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు కళాకారుల ప్రతిభను ప్రోత్సహించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.

తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక అందెశ్రీ : మంత్రి జూపల్లి కృష్ణారావు


హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబరు 10:



తెలంగాణ భాష సంస్కృతిని ప్రగాఢం గా ప్రేమించిన గొప్ప మానవతా వాది అందెశ్రీ తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక అని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులు అర్పించారు భాషా సాంస్కృతిక శాఖ నిర్వహణలో జానపద వాగ్గేయకారుడు అందెశ్రీ వర్ధంతి సభ రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తరాలు మారినా అందెశ్రీ రచించిన తెలంగాణ రాష్ట్ర గీతం శాశ్వతం గా నిలిచి ఉంటుందని ఈ విధం గా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రలో ఆయనకు సముచిత స్థానం కల్పించినట్లు తెలిపారు అధ్యక్షత వహించిన సాంస్కృతిక సారథి అధ్యక్షులు డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ అందెశ్రీ మాటలో పాటలో అన్యాయం వివక్షత ల పట్ల భావోద్వేగం వ్యక్తం చేసేవారు అని వివ రించారు వేదిక పై పాల్గొన్న అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షులు విమలక్క ప్రముఖ పత్రికా రచయిత పాశం యాదగిరి లు అందెశ్రీ తో తమ కున్న అనుబంధం గుర్తు చేసుకుంటూ మానవీయ హృదయం నిరాడంబర జీవితం అందెశ్రీ నీ అందరి వాడు గా నిలిపాయనీ అయన ఆకస్మిక మరణం సమస్త సాహితీ లోకానికి విషాదం అని పేర్కున్నారు జర్నలిస్ట్ పిట్టల శ్రీశైలం సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ సింగం చరణ్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు స్వాగతం పలికిన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అందెశ్రీ అందించిన జయ జయ తెలంగాణ రాష్ట్ర గీతం నేడు ప్రతి తెలంగాణ వారి నోట పలుకుతుందని ప్రభుత్వం అదే ఆయనకు ఇచ్చిన నిజమైన నివాళి అని చెప్పారు సాంస్కృతిక సారథి కళాకారులు అందెశ్రీ రచించిన గీతాలను భావస్పారకం గా గానం చేశారు

మహోన్నతమైన వ్యక్తి డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ





-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

కాశ్మీర్‌లో ప్రత్యేక పర్మిట్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ఒకే దేశం, ఒకే ప్రధాన్, ఒకే నిషాన్ అనే సిద్ధాంతాన్ని బలంగా సమర్థించిన మహోన్నతమైన వ్యక్తి డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర మంత్రి బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మంత్రి సౌజన్యంతో
రీత్ కళా సంఘం ఆధ్వర్యంలో
డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జి. కిషన్ రెడ్డి. గౌరవ అతిథులుగా ప్రముఖ టాలీవుడ్ నటుడు డా. సుమన్ తల్వార్, ప్రముఖ ఒడిస్సీ నృత్య కళాకారిణి డా. సుభశ్రీ పట్నాయక్, నటుడు జెమినీ సురేష్, నటి సంధ్య జనక్, ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్, అథ్లెట్ అను ప్రసాద్ లు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెహ్రూ తప్పుడు ఆలోచన విధానాలను వ్యతిరేకించారని తెలిపారు. 74 ఏళ్ల తర్వాత 370 ఆర్టికల్ ను రద్దు చేయడంతో ముఖర్జీ ఆత్మకు శాంతి చేకూరిందని తెలిపారు. అంతకు ముందు ముఖర్జీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రముఖ కళాకారులు, నృత్య గురువులు, వివిధ నృత్య అకాడమీలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. డా. సుభశ్రీ పట్నాయక్ ఒడిస్సీ నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే గురు డి. బాలాజీ బృందం, లక్ష్మీ కూచిపూడి డాన్స్ అకాడమీ, గురు అనన్య రెడ్డి బృందం, గురు వందన వెంకట్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డా. శ్రీనివాస రావు బృందం ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు కళాకారుల ప్రతిభను ప్రోత్సహించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.



యాదగిరిగుట్టలో మూడు రోజుల పాటు కార్తీకోత్సవం--2026



భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ కళల సమ్మేళనంగా ఉత్సవాలు.. నవంబర్ 20 నుంచి 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 10:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా మూడు రోజుల పాటు కార్తీకోత్సవం--2026ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. నవంబర్ 20 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి సంగీత కచేరీలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించనున్నాయి.

ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట దేవస్థానం ఈఓ భవాని శంకర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

కార్తీకమాస పవిత్రత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను చాటిచెప్పడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ కళారూపాలను పరిరక్షించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో యాదగిరిగుట్ట దేవస్థానం తొలిసారిగా మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రముఖ ధార్మిక పండితులు, ఆధ్యాత్మిక వక్తల ప్రవచనాలతో పాటు ప్రముఖ కళాకారుల సంగీత, నృత్య ప్రదర్శనలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

నవంబర్ 20న ఆధ్యాత్మిక ప్రవచనం, జానపద సంగీతం

ఉత్సవాల తొలిరోజైన నవంబర్ 20, శుక్రవారం సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు శ్రీమతి తేలు విజయ జానపద భక్తి సంగీత కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నారు. అదే రోజు ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవస్థాన అర్చక బృందం ఆధ్వర్యంలో లి

శ్రీ లక్ష్మీనరసింహ నామార్చన సహిత కోటి పుష్పార్చన

.స్వామివారిని దివ్య నామాలతో స్తుతిస్తూ కోటి పుష్పాలతో పూజలు సమర్పించే ఈ కార్యక్రమం ఉత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఘట్టంగా నిలవనుంది.

నవంబర్ 21న ప్రముఖ కళాకారుల నృత్య ప్రదర్శనలు

రెండో రోజైన నవంబర్ 21, శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పరంపర సంస్థ దర్శకత్వంలో ప్రత్యేక నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆర్.పి. పట్నాయక్, నిహాల్, నిత్యసంతోషిని, గోపిక పూర్ణిమ, శ్రీనిధి, స్వప్న తదితర కళాకారులు వాద్య బృందం సహకారంతో తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు.

నవంబర్ 22న శాస్త్రీయ, తెలంగాణ సంప్రదాయ నృత్యాల వైభవం

ఉత్సవాల చివరి రోజైన నవంబర్ 22, ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు రుద్రాక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒడిస్సీ నృత్య ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం అభినేత్రి బృందం తెలంగాణ దేవాలయాల ఇతివృత్తంతో ప్రత్యేక నృత్య ప్రదర్శన ఇవ్వనుంది. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు కళాకృష్ణ బృందం పేరిణి నృత్య ప్రదర్శనతో పాటు ఒడిస్సీ, తెలంగాణ దేవాలయాల ఇతివృత్తంతో కూడిన సమిష్టి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకోనున్నాయి.

ఆధ్యాత్మికతకు, కళలకు వేదికగా కార్తీకోత్సవం

భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం, భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు భారతీయ శాస్త్రీయ కళారూపాల గొప్పతనాన్ని, తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను రూపొందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి ఉత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థానం కోరుతోంది.

మూడు రోజుల పాటు భక్తి, సంగీతం, నృత్యం, ఆధ్యాత్మిక ప్రవచనాలతో యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136